

బ్రేక్..షాక్..!



- సిద్దూ నిర్ణయాలకు అధిష్టానం అడ్డుకట్ట
- చివరి క్షణంలో ఎమ్మెల్సీల జాబితా నిలిపివేత
- రాజణ్ణను కాపాడే ప్రయత్నాలకూ చెక్
- వరుస దెబ్బలతో సీఎం వర్గీయుల్లో ఆందోళన

బెంగళూరు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): రాజకీయాల్లో ఇటు రాష్ట్రమైనా అటు అధిష్టానమైనా ఎదురే లేదనే రీతిలో వ్యవహరిస్తున్న సీఎం సిద్దరామయ్య మారుతున్న రాజకీయ పరిణామాలతో నిస్సహాయుడు అవుతున్నట్లు అనిపిస్తోంది. రెండేళ్ల పాలన సంతృప్తికరం అనిపించినా ఇటీవల సీఎం సిద్దరామయ్య ఇటు రాష్ట్రంలోనూ అటు అధిష్టానం వద్ద ఏమీ సాధించుకునే పరిస్థితి లేకుండా పోతోంది. పైగా అత్యంత ఆప్తుడైన మంత్రి రాజణ్ణను కేబినెట్ నుంచి తొలగించే విషయంలో సిద్దరామయ్య చేతులెత్తేశారు. అధిష్టానంతో కానీ అగ్రనేత రాహుల్ గాంధీతో మాట్లాడి కనీసం బలవంతపు రాజీనామా అయినా చేయించవచ్చు. విధానసౌధలోనే ఇటు సీఎం సిద్దరామయ్య అటు మంత్రి రాజణ్ణ ఉన్నారు. శాసనసభ సమావేశాలు జరుగుతుండడంతో శాసనసభ్యులంతా ఉన్నారు. అటువంటి సమయంలోనే రాజణ్ణ చేత రాజీనామా కోరకుండా అధిష్టానం ఆదేశించిందని ఏకంగా రాజ్‌భవన్‌కు లేఖ పంపి కేబినెట్ నుంచి ఉద్వాసన పలికించారు. సీఎంకు ఆప్తుల్లో అత్యంత కీలకమైన రాజణ్ణను మంత్రి పదవినుంచి కాపాడలేక పోవడం సరే.. కనీసం రాజీనామాను కోరకుండా ఉద్వాసన పలికించారంటే అధిష్టానం అల్టిమేటం జారీ చేసినట్టుగా ఉంది. అల్పసంఖ్యాత (మైనారిటీ), హిందుళిత (వెనుకబడిన వర్గాలు), దళిత (అహింద) సామాజిక వర్గాలకు అండగా ఉన్న నేతగా పేరొందారు. 'అహింద' నేతగానే సుమారు రెండు దశాబ్దాలుగా సిద్దరామయ్య వ్యవహరిస్తున్నారు. ఈ నాయకత్వంతో ఎవరినైనా ఎదుర్కోవచ్చునని భావించారు. సిద్దరామయ్య కాంగ్రెస్‌కు వచ్చినప్పుడు ఇదే అజెండాతో ముందుకెళ్లడంతో అప్పట్లో అనుకున్నవన్నీ సాధించారు.

ఖర్గే ఢిల్లీకి వెళ్లడంతోనే కీలక స్థానం

2009లో రాష్ట్రంలో ప్రతిపక్షనేతగా ఉన్న మల్లికార్జున ఖర్గేను లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయించి ఢిల్లీకి అధిష్టానం రప్పించుకుంది. ఆ తర్వాత మంత్రిగా కూడా కొనసాగారు. కాంగ్రెస్‌లోకి వచ్చిన కొద్దికాలంలోనే ఖర్గే ఢిల్లీ వెళ్లడంతో ఖాళీ అయిన ప్రతిపక్షనేత హోదాకు పలువురు ప్రయత్నించారు. అయితే సిద్దరామయ్య వ్యూహాత్మకంగా వ్యవహరించి ప్రతిపక్షనేత స్థానాన్ని దక్కించుకున్నారు. అది కాంగ్రెస్ రాజకీయాల్లో మహత్తరమైన మలుపు అయ్యింది. ఇదే సమయంలోనే శాసనసభ నుంచి రాజ్యసభకు ఆప్తుడైన ఇబ్రహీంను అభ్యర్థిని చేసేందుకు ప్రయత్నించారు. అడ్డంకులు ఎదురు కావడంతో ప్రతిపక్షనేత హోదాకు రాజీనామా చేస్తానని అధిష్టానానికి సందేశం పంపారు.

ఎదురు దెబ్బ తగిలినా వ్యూహాత్మకంగా అడుగులు

బళ్ళారిలో అప్పటి బీజేపీ కీలక నేత, మంత్రి గాలి జనార్ధనరెడ్డి గనుల్లో అక్రమాలకు పాల్పడుతున్నారని బెంగళూరు నుంచి బళ్ళారి దాకా సాగిన పాదయాత్ర సంచలనం కలిగించింది. అప్పటి కేపీసీసీ అధ్యక్షుడు ఆర్‌వీ దేశ్‌పాండే, కార్యాధ్యక్షుడు డీకే శివకుమార్ సంపూర్ణంగా సహకరించారు. 2013 ఎన్నికల్లో కాంగ్రెస్‌కు అత్యధిక స్థానాలు రావడంతో సిద్దరామయ్య ముఖ్యమంత్రి అయ్యారు. 2014 లోక్‌సభ ఎన్నికలలో రాష్ట్రంలో పార్టీకి ఘోర పరాభవం జరిగింది. అయితే దేశవ్యాప్తంగా కాంగ్రెస్‌కు ఎదురుగాలి తగలడంతో సిద్దరామయ్యపై చర్యలు లేకుండా పోయాయి. 2018 శాసనసభ ఎన్నికలలో పార్టీ ఘోరంగా ఓడింది. అయితే వ్యూహాత్మకంగా జేడీఎస్‌తో కలసి సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు చేశారు. ఏడాదిన్నర కాలంలోనే ప్రభుత్వం కూలింది. ఆ తర్వాత జేడీఎస్ నేత కుమారస్వామి ముఖ్యమంత్రి అయినా సిద్దరామయ్యకు సమన్వయకర్త హోదా కల్పించారు. 2019లో బీజేపీ అధికారంలోకి రావడంతో మరోసారి ప్రతిపక్షనేత అయ్యారు. 2023 శాసనసభ ఎన్నికలలో పరిస్థితిలో మార్పు వచ్చింది. కేపీసీసీ అధ్యక్షుడిగా ఉన్న డీకే శివకుమార్ పట్టు సాధించారు. అయితే ఆయన ఎంతగా ప్రయత్నాలు చేసినా సీఎం పదవి సిద్దరామయ్యకే దక్కింది. రెండేళ్ల పాలనలో వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్‌కు సంబంధించిన గ్రాంట్లలో అవినీతితో మంత్రి నాగేంద్ర రాజీనామా చేయాల్సి వచ్చింది. ఇక మైసూరు నగరాభివృద్ధి ప్రాధికార (ముడా)లో భార్య పార్వతి పేరిట ఇంటి స్థలాల వివాదంతో సిట్, ఈడీ దర్యాప్తు, కోర్టు విచారణలు సాగాయి. అయితే ముఖ్యమంత్రి పదవికి ఢోకా లేకుండానే ముగిసింది.

కులగణనపై సొంత పార్టీలోనే వ్యతిరేకత

ఇదే తరుణంలోనే పదేళ్లక్రితం జరిగిన కులగణనను ఆమోదించేందుకు సీఎం పట్టుబట్టి నివేదికను స్వీకరించారు. లింగాయత, ఒక్కలిగ సామాజిక వర్గాల సంఖ్య గణనీయంగా తగ్గడంతో రెండు సామాజికవర్గాలు నివేదికపై అభ్యంతరం వ్యక్తం చేశాయి. ఈ పరిణామంతో అధిష్టానం సున్నితంగా నివేదికను పక్కన పెట్టాలని సూచించింది. ఇది వ్యక్తిగతంగా సిద్దరామయ్యకు వ్యతిరేక నిర్ణయమైనా ఎటువంటి సాహసం చేసే పరిస్థితి లేకుండా పోయింది. రెండు నెలలక్రితం ఆర్సీబీ విజయోత్సవాల వేళ తొక్కిసలాటలో 11మంది అభిమానులు దుర్మరణం చెందారు. ప్రభుత్వానికి ఈ సంఘటన కోలుకోలేని దెబ్బలాంటిదే. ఒకానొక దశలో పోలీసులు సాధ్యం కాదన్నా ఉత్సవాలు నిర్వహించారు. విధానసౌధ, చిన్నస్వామిస్టేడియం వద్ద విజయోత్సవాలు సాగించడం పట్ల కూడా విమర్శలు వ్యక్తమయ్యాయి. ఈ సంఘటనలో సీఎం రాజకీయ కార్యదర్శి, ఆప్తుడైన గోవిందరాజు రాజీనామా చేయాల్సి వచ్చింది. ఇక తాజాగా రాజణ్ణను తొలగించిన విధానం అందరికీ తెలిసిందే. దాదాపు పదేళ్లుగా ఎమ్మెల్సీల ఎంపికకు సంబంధించి సిద్దరామయ్య సూచించిన పేర్లకు అధిష్టానం అభ్యంతరం లేకుండా సుముఖత తెలిపేది. నలుగురు ఎమ్మెల్సీలను భర్తీ చేసే విషయమై నాలుగైదు నెలలుగా కసరత్తు చేస్తున్నా కొలిక్కి రాలేదు. నెలరోజులక్రిందట దాదాపు పేర్లు బహిరంగమైనా అంతలోనే రద్దయ్యాయి. ఆ విషయంలో కూడా సీఎంకు అనుకూలం కాలేదు. సాధారణంగా కేబినెట్‌లోకి ఎవరినైనా తీసుకోవడం లేదా తొలగించడం అనేది ముఖ్యమంత్రి విచక్షణకే ఉంటుంది. కానీ ఇక్కడ సిద్దరామయ్యకు కూడా తొలగించాల్సిందే అంటూ అల్టిమేటంలా సూచించి గంటల వ్యవధిలోనే రాజణ్ణపై వేటు వేశారు. తాజాగా ధర్మస్థళ వివాదంలోనూ ఆత్రుతతో సిట్ జారీ చేశారనే విమర్శలు ఎదుర్కొంటున్నారు. స్వయంగా ఏఐసీసీ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్ నాలుగైదు నెలలక్రిందట కేబినెట్ ప్రక్షాళన ఉంటుందని వ్యాఖ్యానించారు. అది కూడా పెండింగ్‌లో ఉంది. పార్టీలో ఎవరికి వారు వ్యవహరిస్తున్నారని నేరుగా అధిష్టానం దూత, పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జ్ రణదీప్‌సింగ్ సుర్జేవాలా ఏకంగా పదిరోజుల పాటు మకాం వేసి 100కుగాపై ఎమ్మెల్యేలు, మంత్రులు, ఓడిపోయిన అభ్యర్థులతో ఒక్కొక్కరిగా పిలిపించుకుని మాట్లాడారు. ఈ పరిణామం ముఖ్యమంత్రికి ఏ విధమైన అనుకూలం కాదనేది తెలిసిందే. ఇలా వరుసగా ముఖ్యమంత్రి సిద్దరామయ్యపై వ్యతిరేక అభిప్రాయాలతో ఉన్న అధిష్టానం రానున్న రోజుల్లో ఎటువంటి నిర్ణయాలు తీసుకున్నా పాటించక తప్పడం లేదనే పరిస్థితిలో ముఖ్యమంత్రి ఉన్నారనిపిస్తోంది. వరుస నిర్ణయాలు సీఎం సిద్దరామయ్య వర్గీయుల్లో ఆందోళన కలిగిస్తోందని చెప్పవచ్చు.



ఇస్కాన్‌లో రాధాకృష్ణులకు క్షీరాభిషేకం చేస్తున్న అర్చకులు

మురిసిన మురారి

- వాడవాడలా కృష్ణాష్టమి వేడుకలు
- భక్తులతో కిటకిటలాడిన ఇస్కాన్ ఆలయం
- రాధాకృష్ణుల వేషధారణలో అలరించిన చిన్నారులు



ఇస్కాన్‌లో గోపికల వేషధారణలో బాలికలు

వివరాలు 7లో

ఉడుపిలో వేడుకలు లేవు

- శ్రీకృష్ణుడి భక్తుల్లో నిరాశ



బెంగళూరు, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా కృష్ణాష్టమి సంబరాలు జరుగుతున్నాయి. కానీ శ్రీకృష్ణుడి పవిత్ర స్థలంగా పేరొందిన ఉడుపిలో మాత్రమే అష్టమి వేడుకలు లేకపోవడంతో భక్తులు, వ్యాపారులు నిరాశతో ఉన్నారు. ఉడుపిలో ప్రత్యేకంగా అష్టమి వేడుకలు కొనసాగడం లేదు. సాధారణ భక్తుల దర్శనం మాత్రం యథావిధిగా సాగుతోంది. దేశమంతటా చంద్రమాన పద్ధతిలో అష్టమి వేడుకలను జరుపుకోవడం ఆనవాయితీ. కానీ ఉడుపిలో సూర్యమాన పద్ధతిని ఆచరిస్తారు. పౌర్ణమి, అమావాస్య లెక్క ప్రకారం ఇతర ప్రాంతాలలో ఆచరణ ఉండగా తుళునాడు, కరావళి (తీరజిల్లాల్లో) సంక్రమణ ప్రత్యేకంగా భావిస్తారు. ఇక్కడ సెప్టెంబరు 14న అష్టమిని ఆచరించాలని నిర్ణయించారు. ఈసారి అష్టమి తిథితోపాటు రోహిణి నక్షత్రం కలసి రానుండడంతో అదే రోజున కృష్ణాష్టమి ఆచరించనున్నారు. ఇలా ఈసారి ఉడుపిలో శనివారం ఎలాంటి వేడుకలు లేవు. కాగా చంద్రమాన పద్ధతిలో సాంకేతికంగా సాధారణ పూజలు మాత్రమే మఠంలో పూజలు నిర్వహిస్తున్నారు. భక్తులకు దర్శన అవకాశం కల్పిస్తున్నారు. చిన్నికృష్ణుల సందడి, వెన్న తినే సంబరాలు, ఇతర వేడుకలు సెప్టెంబరులో నిర్వహించనున్నారు.

అందరికీ రుణపడి ఉంటా



- 'డెవిల్' సినిమాకు ఆటంకం ఉండదని ఆశిస్తున్నా
- అభిమానులకు జైలు నుంచే దర్శన్ సందేశం

బెంగళూరు, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): చిత్రదుర్గ రేణుకాస్వామి హత్యకేసులో నటుడు దర్శన్‌కు బెయిల్ రద్దు కావడంతో మరోసారి జైలుపాలైన సంగతి విదితమే. నటుడు దర్శన్, పవిత్రా గౌడ సహా మరికొందరికి బెయిల్ రద్దు కావడంతో అందరూ పరప్పన అగ్రహార జైలుకు చేరారు. గురువారం రాత్రి నటుడు దర్శన్ పరప్పన అగ్రహార జైలుకు చేరుకున్నాడు. జైలుకు వెళ్లిన రెండు రోజులకే తన అభిమానులకు నటుడు దర్శన్ ఒక సందేశం పంపారు. సదరు సందేశాన్ని దర్శన్ భార్య విజయలక్ష్మి సోషల్‌మీడియా ద్వారా పంచుకున్నారు. 'కన్నడ కళాభిమానులకు, సెలెబ్రిటీలకు దాస సాష్టాంగ నమస్కారాలు. నా సుఖాలతోపాటు కష్టాలలో వెన్నంటిగా నిలిచిన అభిమానులకు జీవితమంతా రుణపడి ఉంటాను. కాగా 'డెవిల్' సినిమాకు సంబంధించి ఎలాంటి ఆటంకం లేకుండా సాగాలని ఆశిస్తున్నాను. ఇందుకు దర్శక, నిర్మాతలు, సాంకేతిక నిపుణులు, ఇతర బృందం సహకారం అందిస్తారని ఆకాంక్షిస్తున్నాను. సినిమాను కేవలం మనోరంజన దృష్టితోనూ చూడాలని ఆశిస్తున్నా' అంటూ దర్శన్ సందేశంలో పేర్కొన్నారు. తద్వారా తాను లోపల ఉన్నా, బయట ఉన్నా సినిమాను గెలిపించాలని పరోక్షంగా అభిమానులకు విజ్ఞప్తి చేశారు. డెవిల్ సినిమా అక్టబరులో విడుదల కావాల్సి ఉంది. అయితే దర్శన్ మళ్లీ జైలుపాలు కావడంతో సినిమా విడుదలలో జాప్యమయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది.

బాలుడిని బలిగొన్న థిన్నర్



కుమారుడు అగస్త్యతో చంద్రకాంత్ (ఫైల్)

- బాలింత అయిన తల్లికి వేడి ధూపం వేస్తుండగా మంటలు చెలరేగి ప్రమాదం
- ధారవాడ నగరం సంతోష్‌నగర్‌లో దుర్ఘటన

8లో

జై హనుమాన్

- శ్రావణ శనివారం సందర్భంగా అంజన్న ఆలయాలు కిటకిట



అంజనాద్రిపై..



బళ్లారి అభయవరదాంజనేయస్వామికి తమలపాకులతో అలంకరణ



హంపిలో యంత్రోద్ధారణ హనుంతుడు

బళ్లారిరూరల్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి) : శ్రావణ శనివారం సందర్భంగా హనుమాన్ నామస్మరణ మార్మోగింది. బళ్లారి నగరంలోని వెంకటేశ్వర నగర్‌లో వెలసిన అభయ వరదాంజనేయస్వామికి తమలపాకులతో అలంకరణ నిర్వహించారు. ఉదయం నుంచే ఆలయంలో అభిషేకాలు, అర్చనలు చేపట్టారు. ఈ సందర్భంగా నగరంలో భక్తాదులతో పెద్దఎత్తున పాల్గొని స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు ధనుంజయ తెలిపారు.

కంప్లి, (ఆంధ్రజ్యోతి): తాలూకా వ్యాప్తంగా అంజనేయ స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కంప్లి, కురుగోడు తదితర పట్టణాల్లో గ్రామాల్లో పూజలు, అభిషేకాలు జరిపారు. కిష్కిందలోని అంజనాద్రి కొండపైన అంజనేయస్వామికి, కంప్లిలోని అభయాంజనేయస్వామికి, ముద్దటనూరులోను, హంపి పుణ్య క్షేత్రంలో యంత్రోద్ధారక ఆంజనేయస్వామి వారికి పుష్పాలతో, ఆకులతో, మంగళహారతి పూజలు నిర్వహించారు. ప్రతి ఆలయంలోను భక్తులు పోటెత్తారు. ఉదయం నుంచే క్యూలైన్లలో నిల్చుని భక్తులు స్వామిని దర్శించుకున్నారు. కొన్ని ఆలయాల్లో కృష్ణాష్టమి సందర్భంగా శ్రీకృష్ణున్ని ప్రతిష్టించి గీతా పఠనం గావించారు. భక్తులకు అన్నప్రసాదం అందజేశారు. రాత్రంతా భజనలతో భక్తులు స్వామి సన్నిధిలో గడిపారు. శ్రావణమాసం చివరి శనివారం సందర్భంగా వచ్చే వారం ఘనంగా ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. ఈ శ్రావణంలో ఐదు శనివారాలు రావడం విశేషమని అర్చకులు తెలిపారు.

ధర్మస్థళపై తప్పుడు ప్రచారం

- కుట్రలో హిందూ వ్యతిరేక సంస్థలు, కొందరు యూట్యూబర్లు
- యలహంక ఎమ్మెల్యే ఎస్‌ఆర్ విశ్వనాథ్ ఆగ్రహం
- 300 వాహనాలతో చలో ధర్మస్థళ ర్యాలీ ప్రారంభం



ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఎస్‌ఆర్ విశ్వనాథ్

బెంగళూరు, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): ధర్మస్థళపై తప్పుడు ప్రచారం చేస్తున్నవారిపై చర్యలు తీసుకోవాలని యలహంక ఎమ్మెల్యే ఎస్‌ఆర్ విశ్వనాథ్ నేతృత్వంలో 300కుపైగా కార్లలో బీజేపీ కార్యకర్తలు ధర్మస్థళకు బయల్దేరారు. శనివారం సింగనాయకనహళ్లి వద్ద బయల్దేరే ముందు విశ్వనాథ్ మీడియాతో మాట్లాడుతూ ధర్మస్థళపై ఓ వ్యక్తి ఫిర్యాదు చేశారని, ఏకంగా సిట్ ఏర్పాటు చేశారన్నారు. ప్రారంభంలో విచారణలు స్వాగతించామని, కానీ దాని వెనుక హిందూ వ్యతిరేక, ధర్మస్థళ వ్యతిరేక యూట్యూబర్‌లు మరికొందరు ఉన్నారనేది తెలుస్తోందన్నారు. జరుగుతున్న పరిణామాలను వ్యతిరేకిస్తూ 300 కార్లలో ధర్మస్థళకు వెళ్తున్నామన్నారు. సాయంత్రం అక్కడికి చేరుకుంటామన్నారు. మంజునాథస్వామిని దర్శించుకుంటామన్నారు. రాత్రికి అక్కడే బస చేస్తామన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర, పరిషత్ ప్రతిపక్షనేత చలవాది నారాయణస్వామితోపాటు ముఖ్యనాయకులంతా ధర్మస్థళకు రాత్రికి చేరుకుంటారన్నారు. ఆదివారం ఉదయం మరోసారి మంజునాథస్వామిని దర్శించుకుని సంకల్పం చేస్తామన్నారు. ధర్మస్థళ వివాదంపై … డీసీఎం డీకే శివకుమార్ శుక్రవారం చేసిన వ్యాఖ్యలు సంతోషకరమన్నారు. ఇదంతా వెల్‌ప్లాన్డ్ స్ట్రాటజీ అన్నారని, ఇదే వ్యాఖ్యలు ప్రారంభంలోనే చేసి ఉంటే సిట్ దర్యాప్తు కొనసాగేది కాదన్నారు.



ర్యాలీలో వాహనాలు

స్థానికంలో భారీగా ఖాళీలు

- ఏళ్ల తరబడి భర్తీ కాని ఉద్యోగాలు
- లబ్ధిదారులకు చేరని పథకాలు
- ఆదాయ వనరులకూ ఆటంకమే

బెంగళూరు, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): ప్రజాసేవ సరళీకృతంగా ఉండాలని ప్రభుత్వ పథకాలతోపాటు పారిశుద్యం, తాగునీరు, విద్యుత్‌దీపాలు వంటి కీలకమైన పనులు ఎప్పటికప్పుడు అమలు కావాలని జనాభాకు అనుగుణంగా స్థానిక సంస్థలను నెలకొల్పారు. జనాభా పెరిగినా, ప్రధాన నగరాలకు సమీపంలో ఉన్నా విలీనం చేస్తారు. తద్వారా నగర, పురసభ, పట్టణ పంచాయతీల పరిధిలో నివసించే ప్రజలకు వెంటనే సౌకర్యాలు సమకూర్చాలనేది ప్రభుత్వ ఆశయం. స్థానిక సంస్థలు బలోపేతంగా ఉంటేనే ఆదాయం పెరిగి అభివృద్ధికి దోహదపడుతుందని ఎంతోమంది నిపుణులు అభిప్రాయపడ్డారు. గ్రామ స్వరాజ్యం అనేది కేవలం పల్లెలకే కాకుండా ప్రజలు నివసించే ప్రతిచోటా మౌలిక సదుపాయాలు కల్పించాలనేది కీలకమైనది.

రాష్ట్రవ్యాప్తంగా నగరసభ, పురసభ, పట్టణ పంచాయతీల్లో ఉద్యోగుల లోటు కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. రెగ్యులర్ నియామకాలు లేకపోవడంతో కాంట్రాక్టు సిబ్బంది ద్వారానే అన్ని పనులు అమలు చేయాల్సి వస్తోంది. కాంట్రాక్టు సిబ్బందిని పని ఒత్తిడితో వేధింపులేగానీ వారి ఉద్యోగాలకు భద్రత లేకుండాపోయింది. పాలకవర్గం లేదా అధికార వర్గంలో ఎవరికీ ఆగ్రహం వచ్చినా బలయ్యేది కాంట్రాక్టు ఉద్యోగులే. నాలుగు దశాబ్దాల క్రితంతో పోలిస్తే పట్టణ పంచాయతీల్లోనూ అభివృద్ధి, ఆదాయం పెరిగింది. కానీ పనిచేసే ఉద్యోగులే లేకుండా పోయారు. రాష్ట్రంలో 61 నగరసభలు, 123 పురసభలు, 117 పట్టణ పంచాయతీలు ఉన్నాయి. వీటన్నింటికీ కలిపి 37,758మంది రెగ్యులర్ ఉద్యోగులు పనిచేయాల్సి ఉండేది. ప్రస్తుతం అన్నింటికీ కలిపి పనిచేస్తున్నవారు 10,858 మంది మాత్రమే. ఖాళీపోస్టులు 26,900 ఉన్నాయి. 13,208మంది కాంట్రాక్టు పద్ధతిన పని చేస్తున్నారు. సిబ్బంది కొరతతో ప్రతి రోజూ రెగ్యులర్ ఉద్యోగులకు బాధ్యతలు పెరిగిపోతున్నాయి. కాంట్రాక్టు పద్ధతిన నియమించుకుంటున్నా వారికి పూర్తిస్థాయి బాధ్యతలు అప్పగించడం లేదు. ఆర్థిక పరమైన, బాధ్యతాయుతమైన పర్యవేక్షణ రెగ్యులర్ ఉద్యోగుల ద్వారానే అమలు చేస్తున్నారు. రాజీవ్ ఆవాజ్ యోజనె, అండర్ గ్రౌండ్ డ్రైనేజ్, చిన్న, మధ్య తరహా పట్టణాలలో మౌలిక సదుపాయాల అభివృద్ధి, తాగునీటి సరఫరా, ముఖ్యమంత్రి నగరోత్థాన, అమృతనగర పథకంతోపాటు పలు పథకాల అమలుకు ఏటా కేంద్రం, రాష్ట్రాలనుంచి వేల కోట్ల రూపాయలు విడుదల చేస్తున్నారు. అయితే ఉద్యోగుల కొరతతో నగరసభలలో కొంత మెరుగు అనిపించినా పట్టణ పంచాయతీల పరిధిలో పథకాలు ప్రామాణికంగా అమలు కావడం లేదు. ప్రజలు నెలల తరబడి కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోంది. బర్త్, డెత్ సర్టిఫికెట్‌లకోసం నెలల తరబడి వేచియుండాల్సిన పరిస్థితి ఉంది.

ఆదాయానికి గండి

స్థానిక సంస్థలలో నీటి బిల్లులు, ఆస్తి పన్నులు, వాణిజ్యపన్నులు వంటి ఆదాయ వనరులు సకాలంలో వసూలు చేయలేకపోతున్నారు. దీంతో స్థానిక సంస్థల ప్రగతికి గొడ్డలిపెట్టు అవుతోంది. మరోవైపు కోట్లాదిరూపాయలు ప్రభుత్వ ఖజానాకు గండి పడుతోంది. ఏడాది నుంచి ఏడాదికి ఆదాయం పక్కదారి పడుతోంది. పన్నుల వసూళ్లు, కొత్తగా పన్నులు విధించడంతోపాటు వివిధ ఆదాయ మార్గాలలో అవినీతి చోటు చేసుకోవడంతో ఆదాయం పక్కదారి పడుతోంది. ఆస్తిపన్ను వసూళ్లకు రాష్ట్రంలో నిర్దిష్టమైన నిబంధనలు లేకుండా పోయాయి. ఏటా ప్రభుత్వ ఆదాయానికి వేల కోట్ల రూపాయలు నష్టం కలుగుతోంది. పన్నుల వసూళ్లు సమగ్రమైన విధానంలో అమలు చేయకపోవడంతో నగరసభ, పురసభ, పట్టణపంచాయతీలతోపాటు స్థానిక సంస్థలలో భారీగా అక్రమాలు చోటు చేసుకుంటున్నాయి.

రెగ్యులర్ ఉద్యోగులు

రెగ్యులర్‌గా ఉద్యోగులను నియమించుకోకుండా కాంట్రాక్టు పద్ధతితో తీసుకుంటున్నందున వారు ఎలాగైనా ఉద్యోగంలో చేరాలని, ఎంతోకొంత వెనకేసుకోవచ్చునని వచ్చేవారు ఉన్నట్టు విమర్శలు ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉండే ఉద్యోగాలకోసం 13,208మందిని అంచెలంచెలుగా నియమించుకున్నారు. నిర్దిష్ట వేతనానికి తగిన పనిని కేటాయిస్తున్నారు. గ్రూప్ ఏ హోదాకు 34మంది, గ్రూప్ సీలో 2439, డి గ్రూప్‌లో 9803 తో కలసి మొత్తం 13208మంది పనిచేస్తున్నారు. గ్రూప్ బి పోస్టులకు కాంట్రాక్టు ఉద్యోగులను తీసుకోలేదు. కానీ కొన్ని నగరసభ, పురసభ, పట్టణ పంచాయతీలలో మంజూరైన పోస్టులకంటే ఎక్కువమంది పనిచేస్తున్నారు. అభివృద్ధి చెందాయని, జనాభా పెరిగిందనే కారణంతో పురసభలు, పట్టణ పంచాయతీలను అప్‌గ్రేడ్ చేశారు. అయితే అందుకు తగిన సిబ్బందిని కేటాయించకపోవడంతో అభివృద్ధి పనులు కుంటుపడుతున్నాయి.



జిల్లాల వారీగా పోస్టుల వివరాలు..

బెళగావి జిల్లాలో అత్యధికంగా 3472 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. శివమొగ్గలో 1798 పోస్టులు, బాగల్కోటెలో 1309 పోస్టులు బెంగళూరు నగరలో 1023 పోస్టులు, దక్షిణకన్నడలో 1022 పోస్టులు, మైసూరులో 955, కోలారులో 936, ఉత్తరకన్నడలో 935, హావేరిలో 833, గదగ్‌లో 722 పోస్టులు, మండ్యలో 672 పోస్టులు, చిత్రదుర్గ 691 పోస్టులు, చిక్కబళ్లాపుర 680, రామనగరలో 651, హాసన్‌లో 597, కలబురగిలో 595, విజయపురలో 559 పోస్టులు, బెంగళూరు గ్రామీణలో 596 పోస్టులు, ఉడుపిలో 508, చిక్కమగళూరు 493, తుమకూరులో 466, దావణగెరెలో 343 పోస్టులు, చామరాజనగరలో 282, కొడగులో 163, ధారవాడ జిల్లాలో 145 పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

అద్దే ముద్దా..?

కదిరి, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): అన్ని సౌకర్యాలతో సొంత భవనాలు ఉన్నా, వాటిని కాదని ఎస్టీ గురుకుల కళాశాలను అద్దె భవనంలో నిర్వహిస్తుండటంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. పట్టణ శివారు ప్రాంతం కదిరి - హిందూపురం రహదారిలో అన్నమరియ భవనాల్లో ఎస్టీ గురుకుల కళాశాలను నిర్వహిస్తున్నారు. దీనికి బాడుగ నెలకు రూ.76 వేలు. దీన్ని 2014లో ప్రారంభించారు. కొన్ని నెలల పాటు తనకల్లు మండలం సీజీ ప్రాజెక్టు వద్ద ఉన్న ఎస్టీ గురుకుల పాఠశాలలో తరగతులు నిర్వహించారు. అక్కడ ఇబ్బందిగా ఉందని కదిరి మున్సి పాలిటీ పరిధిలోని కుటా



తనకల్లు మండల కేంద్రంలో ఖాళీగా ఉన్న హాస్టల్ భవనం

గుళ్ల వద్ద ఉన్న శాంతినికేతన్ పాఠశాలలో నిర్వహించారు. ఆ తరువాత హిందూపురం రోడ్డులో ఉన్న అన్న మరియ పాఠశాలల భవనాల్లోకి గురుకుల కళాశాలను మార్చారు. అప్పటి నుంచి ఇక్కడే తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ కళాశాలలో ఎంపీసీ, బైపీసీ గ్రూపులు మాత్రమే ఉన్నాయి. అప్పటి నుంచి ఉన్న అరకొర సౌకర్యాల తోనే కళాశాల నిర్వహిస్తున్నారు. 2014లో ఈ కళాశాలకు పక్కా భవ నాల నిర్మాణానికి దాదాపు రూ.5 కోట్లు వచ్చాయి. దీంతో భవన నిర్మా ణానికి మండలంలోని గంగన్నగారిపల్లికి సమీపంలో పునాదులు వేసి గోడలు నిర్మించారు. ఇంతలోనే ప్రభుత్వం మారడంతో ఆ భవనం నిర్మాణ పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయి. ఆ తరువాత నిధులు వెనక్కి పోయినట్లు తెలిసింది. అప్పటి నుంచి ఈ బాడుగ భవనంలోనే కళాశాల నిర్వహిస్తున్నారు.

బాడుగ భవనంలో బాధలు

గిరిజన గురుకుల కళాశాల ఇప్పుడు నిర్వహిస్తున్న భవనంలో విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ కళాశాలకు వెనుక వైపున గుట్ట ఉంది. కళాశాల భవనానికి ప్రహరీ లేదు. నీటి సౌకర్యం అరకొరగా ఉంది. ఈకళాశాలలో ప్రస్తుతం 160 మంది వరకు ఉన్నారు. మరుగుదొడ్లు, స్నానపు గదులు చాలినన్ని లేవు. అయినా అలాగే నెట్టుకొచ్చారు. గత సంవత్సర నుంచి కదిరి - హిందూపురం రోడ్డు విస్తరణ పనులు చేపట్టారు. దీంతో కళాశాలకు ముందు వైపున ఉన్న ప్రహరీని తొలగించారు. దీంతో బాలికల మరుగుదొడ్లు, స్నానపు గదులు రోడ్డుపైకి కనబడుతున్నాయి. రోడ్డు నుంచి వచ్చే దుమ్ము, ధూళితో ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో ఎవరు ఏవైపు నుంచి హాస్టల్ గదుల్లోకి వస్తారోనని భయంతో విద్యార్థినులు ఉన్నారు. అడవి ప్రాంతం కావడంతో జంతువులు, విషపురుగులు హాస్టల్ గదుల్లోకి వస్తాయన్న భయం కూడా వారిని వెంటాడుతోంది.

కళాశాలను మార్చాలని ఎమ్మెల్యే ఆదేశం

ఎస్టీ గురుకుల కళాశాలను తక్షణం తనకల్లు సీజీ ప్రాజెక్టుకు మార్చాలని ఎమ్మెల్యే కందికుంట ఆ కళాశాల అధికారులను ఆదేశించారు. నిత్యం అదే రహదారిపై వెళ్లే ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ అక్కడి పరిస్థితిని గమనించారు. ఈక్రమంలోనే నాలుగు రోజుల కిందట స్వయంగా ఆయనే ఆ కళాశాలకు వెళ్లి అక్కడి పరిస్థితిని పరిశీలించారు. అక్కడ అరకొర సౌకర్యాల నడుమ విద్యార్థినులు పడుతున్న ఇబ్బందిని చూసి చలించిపోయారు. వారంలోపు కళాశాలను ఇక్కడి నుంచి తరలించాలని ఆదేశించారు. అయితే అధికారులు మాత్రం వాటిని పట్టించుకోవడం లేదు.

టమోటా కిలో రూ.42

అనంతపురం రూరల్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి):కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో శనివారం కిలో టామోటాలు గరిష్ఠంగా 42 రూపాయల ధర పలికినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. అదేవిధంగా కనిష్ఠంగా రూ.24, సరాసరిగా రూ.32తో విక్రయాలు జరిగాయన్నారు. మార్కెట్‌కు 3,300 టన్నుల టమోటాలు వచ్చినట్లు పేర్కొన్నారు.





ఇస్కాన్ మందిరంలో విశేషాలంకరణలో పూజలందుకుంటున్న రాధా పార్థసారథులు

వనమాలీ.. బృందా విహారీ..!







ఉత్సవమూర్తుల ఊరేగింపు



ఇస్కాన్ ఆవరణలో సందడి చేస్తున్న చిన్నారులు



పోటెత్తిన భక్తజనం

శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని అనంతపురం నగరంలోని ఇస్కాన్ మందిరంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. లోక కల్యాణార్థం విశ్వశాంతి హోమం నిర్వహించారు. ఆలయ ఆవరణలో సామూహిక విష్ణుసహస్రనామ పారాయణం, ఉట్టికొట్టే ఉత్సవం, రాధాపార్థసారథులకు విశేష పూజలు నిర్వహించారు. మూలమూర్తులకు మహాభిషేకం, పుష్పాభిషేకం చేశారు. వేలాది మంది భక్తులు తరలివచ్చి కృష్ణ భగవానుడిని దర్శించుకున్నారు.

\- ఆంధ్రజ్యోతి, అనంతపురం టౌన్

ఉగ్రం.. భద్రం..!



ధర్మవరం ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యం చేయించి నూర్‌మహమ్మద్‌ను బయటకు తెస్తున్న పోలీసులు

పుట్టపర్తి/ధర్మవరం, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): చేనేత పట్టు వస్త్రాలతో అంతర్జాతీయ ఖ్యాతిగడించిన ధర్మవరంలో ఉగ్రవాద లింకులతో ఉలిక్కిపడింది. ఇక్కడే పుట్టి పెరిగిన ఓ వ్యక్తి.. ఏకంగా పాకిస్థాన్ ఉగ్రవాద సంస్థలతో సంబంధం పెట్టుకున్నాడని తెలిసి స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ధర్మవరంలోని లోనికోటకు చెందిన కొత్వాల్ నూర్ మహమ్మద్(45) వ్యవహారం కలకలం రేపుతోంది. ఇతని తల్లిదండ్రులు బీడీలు చుట్టి ఉపాధి పొందేవారు. ఆ తరువాత నూర్ మహమ్మద్ ఓ టీస్టాల్ ఏర్పాటు చేసుకుని, వ్యాపారం జరగక మూసివేశాడు. అప్పటి నుంచి హోటళ్లలో వంటమనిషిగా పనిచేస్తున్నాడు. మరో మహిళతో వివాహేతర సంబంధం కారణంగా భార్య వదిలేసి వెళ్లిపోయింది. ఉదయం బయటకు వెళితే రాత్రి వరకూ ఇంటికి వచ్చేవాడు కాదని స్థానికులు అంటున్నారు. తాము కలిసి ఉన్నప్పుడు అర్ధరాత్రి 12 గంటలకు ఇంటికి వచ్చేవాడని భార్య అంటున్నారు. ఇంట్లో, హోటల్‌లో ఎప్పుడూ ఫోన్ మాట్లాడుతుండేవాడని అందరూ చెబుతున్నారు. ఉగ్రవాదుల వాట్సాప్ గ్రూప్‌లలో అంశాలను చదివేవాడని, వాటి ప్రభావం అతనిపై ఉందని పోలీసులు నిర్ధారించారు. భవిష్యత్తులో ఏవైనా ఉగ్రవాద కార్యకలాపాలకు ప్రణాళిక రచించాడా అన్న అనుమానాలు వ్యక్తమౌతున్నాయి.

భద్రత ఎంత..?

వ్యాపార కేంద్రంగా అభివృద్ధిచెందిన ధర్మవరంలో వేలాది మంది స్థానికేతరులు ఉపాధి పొందుతున్నారు. హోటళ్లు, రెస్టారెంట్‌లు, శిల్క్‌హౌస్‌లలో పనిచేసేవారు, భవన నిర్మాణ కార్మికులు, డిజైనింగ్ కళాకారులు చాలామంది ఇక్కడ ఉంటున్నారు. ఇలాంటి ప్రాంతంలో స్థానికుడికి ఉగ్రవాదులతో సంబంధాలు బయటపడ్డాయి. దీంతో స్థానికేతరుల వివరాలను సమగ్రంగా సేకరించాలని పోలీసులను స్థానికులు కోరుతున్నారు. ఉపాధి కోసం కోల్‌కత్తా, బిహార్, ఛత్తీస్‌గఢ్ నుంచి ఇక్కడికి చాలామంది వచ్చిపోతుంటారు. వీరి పూర్వాపరాలు తెలుసుకోకుండానే పనిలో పెట్టుకుంటుంటారు. ఇదే అదనుగా ఉగ్రవాదులు ఇక్కడ తిష్ట వేసే ప్రమాదం ఉందని అంటున్నారు. భద్రతపరమైన సమస్యలు తలెత్తకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలన్న డిమాండ్ వస్తోంది.

ఆందోళన కలిగించేలా..

రాష్ట్రంలోని పలు ప్రాంతాలలో ఉగ్రవాదుల ఆనవాళ్లు బయటపడుతున్నాయి. రాయచోటి, విజయనగరం, ధర్మవరం ఘటనలు ఇందుకు ఉదాహరణ. రాయచోటిలో ఉగ్రవాదుల నుంచి పేలుడు పదార్థాలు స్వాధీనం చేసుకున్నారు. 30 ఏళ్లుగా అక్కడ స్థావరాలు ఏర్పాటుచేసుకున్న ఉగ్రవాదులను అదుపులోకి తీసుకున్నారు. ధర్మవరం పట్టణానికి చెందిన నూర్ మహమ్మద్.. ఉగ్రవాద సంస్థలతో వాట్సాప్ గ్రూపుల్లో ఉంటూ, ముస్లిం యువతను ఉగ్రవాదం వైపు ప్రేరేపించేలా పనిచేస్తున్నట్లు పోలీసులు నిర్ధారించినట్లు సమాచారం. ఈ కేసు విచారణ లోతుగా కొనసాగుతున్న నేపథ్యంలో ధర్మవరంలో ఓ యువకుడి వ్యవహారం కలకలం రేపింది. ఎర్రగుంటకు చెందిన రియాజ్ పాకిస్తాన్ స్వాతంత్ర్య దినోత్సావాలు, ఆ దేశ జెండా, సయ్యద్ బిలాల్ వీడియోలను వాట్సాప్ స్టేటస్‌గా పెట్టుకున్నాడు. అతని శనివారం అదుపులోకి తీసుకుని, విచారించి వదిపెట్టారు. ఇలాంటి పోకడలు స్థానికంగా అలజడి రేపుతున్నాయి. తాజా పరిస్థితుల నేపథ్యంలో హిందూపురం, కదిరి, ధర్మవరం ప్రాంతాల్లో అనుమానితుల సోషల్ మీడియా ఖాతా లు, పోస్టులు, చాలాంగ్‌పై పోలీసులు నిఘా పెట్టినట్లు తెలుస్తోంది. మరోవైపు కేంద్ర నిఘా వర్గాలు అందించిన సమాచారంతో నూర్ మహమ్మద్‌ను అదుపులోకి తీసుకున్నారు. బెంగళూరుకు సమీపంలో ఉండటంతో ఉగ్రవాదులు జిల్లాలోకి ప్రవేశిస్తున్నారనే అనుమానాలు వ్యక్తమౌతున్నాయి.



శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం

బ్యాక్ లాక్..!

అనంతపురంరూరల్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో బ్యాక్‌లాగ్ పోస్టు భర్తీ మరుగున పడింది. వర్సిటీ ఉన్నతాధికారుల నిర్లక్ష్యంతో పోస్టుల భర్తీ ప్రక్రియ ఎక్కడికక్కడే నిలిచి పోయింది. హైకోర్టులో కేసు నడుస్తుండటంతో పోస్టుల భర్తీ నిలిచి పోయినట్లు సమాచారం. పోస్టుల భర్తీ కోసం కేసు విత్‌డ్రా చేయించడంలో సంబంధిత అధికారులు కనీస చొరవ చూపడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు పోస్టుల భర్తీ కోసం ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్నారు.

నోటిఫికేషన్ వెలువడి ఎనిమిదేళ్లు..

వర్సిటీలో బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీకి 2017మార్చి 30న నోటిఫికేషన్ వెలువడింది. వర్సిటీలోని అంటెండర్, వాచ్‌మెన్, జూనియర్ అసిస్టెంట్, జూనియర్ ల్యాబ్ అసిస్టెంట్, టెక్నికల్ అసిస్టెంట్, స్టోర్ కీపర్, అసిస్టెంట్ కుక్, క్లీనర్, హెల్పర్ తదితర పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేశారు. దాదాపు 60పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చారు. దీంతో పెద్ద ఎత్తున ఎస్సీ, ఎస్టీలతోపాటు దివ్యాంగుల పోస్టులకు జనరల్ అభ్యర్థులు దర ఖాస్తు చేసుకున్నారు. వర్సిటీ ఉన్నతాధికారుల లెక్క ప్రకారం 7వేలకు పైగా దరఖాస్తులు వచ్చాయి. వాస్తవానికి 11వేలకు పైగా దరఖాస్తులు వచ్చినట్లు సమాచారం.

వర్సిటీకి రూ.లక్షల్లో ఆదాయం

బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ నేపథ్యంలో నిరుద్యోగులు పెద్ద ఎత్తున దరఖాస్తు చేసుకొన్నారు. ఈక్రమంలో ఒక్కో దరఖాస్తుకు రూ.150 చొప్పున వర్సిటీ అకౌంట్‌కి డీడీ(డిమాండ్ డ్రాఫ్ట్) రూపంలో చెల్లించారు. 11వేలకుపైగానే దరఖాస్తులు వచ్చినట్లు సమాచారం. ఈలెక్క రూ.16.5 లక్షలు వర్సిటీకి నిరుద్యోగులు చెల్లించారు. ఇంటర్వ్యూ నిర్వాహణకు అప్పటి అధికారులు చర్యలు చేపట్టారు. ఆ ప్రక్రియ నిర్వహణకు అడ్వాన్స్‌గా రూ.రెండు లక్షల నిధులు కేటాయించినట్లు సమాచారం. అయితే పోస్టుల భర్తీలో రోస్టర్ సరిగాలేదని ఇద్దరు ముగ్గురు కోర్టు ఆశ్రయించారు. దీంతో పోస్టుల భర్తీ ఆగిపోయింది. దీనికితోడు అడ్వాన్స్ రూపంలో కేటాయించిన నిధులు ఓ అధికారి స్వాహా చేసినట్లు సమాచారం.

నిబంధనలు పట్టించుకోకుండా నోటిఫికేషన్

ఏదైన ప్రభుత్వ శాఖలో పోస్టుల భర్తీకి రోస్టర్, నియమ నింబధనలు తప్పనిసరిగా పాటించాలి. ఆమేరకు ఫలాన పోస్టుకు ఫలాన వారు అర్హులని నిర్ణయించి భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయాల్సి ఉంటుంది. అయితే ఇవేవీ అప్పటి అధికారులు చూడకుండానే గుడ్డిగా నోటిఫికేషన్ జారీ చేశారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఫిజికల్లీ చాలెంజ్‌డ్ పోస్టులలో కుకింగ్ పోస్టు, హ్యాండీక్రాఫ్ట్‌కు బ్లైయిండ్ అభ్యర్థులను అర్హులుగా నిర్ణయించినట్లు తెలుస్తోంది. దీంతో ఆ అభ్యర్థులు ఆ పోస్టులకు ఏవిధంగా అర్హులంటూ కొందరూ 2017జూలైలో కోర్టును ఆశ్రయించారు. దీంతో పోస్టుల భర్తీకి బ్రేక్ పడింది. నోటిఫికేషన్ ప్రక్రియ ముందుకు సాగకుండా వర్సిటీలోని ఓ అధికారి కోర్టు మెట్లు ఎక్కించినట్లు ఆయా వర్గాల్లో జరుగుతోంది.

పోస్టుల భర్తీకి ఎదురుచూస్తున్న అభ్యర్థులు

బ్యాక్‌లాక్ పోస్టుల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఎనిమిదేళ్లగా ఎదురుచూపులే మిగిలాయి. అప్పటి వయస్సుకు అను గుణంగా అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఈనేపథ్యంలో కేసు విత్‌డ్రా అయి పాత నోటిఫికేషన్ కొనసాగిస్తే ఎలాంటి సమస్య ఉండదు. అదే కొత్త నోటిఫికేషన్ ఇస్తే అర్హత, వయస్సు తీరిన వారంతా అర్హులు కాకుండా పోతారన్న ఆందోళన అభ్యర్థుల్లో నెలకొంది. వర్సిటీలోని టైంస్కేల్ ఉద్యోగులు ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకు న్నట్లు తెలిసింది. వీరికి ఇదే భయం భయం పట్టుకుంది.

చీనీ టన్ను రూ.20వేలు

అనంతపురం రూరల్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో శనివారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 20వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.10వేలు, సరాసరి ధర రూ.14వేలు పలికాయన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 772 టన్నుల చీనీ కాయలు వచ్చినట్లు పేర్కొన్నారు.



వరదొస్తే.. వాకిట్లోకే..!

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ అధికారులు, పాలకుల నిర్లక్ష్యం ప్రజలకు శాపంగా మారింది. ప్రధాన వంకల్లో పూడిక పేరుకుపోయి, కంప చెట్లు పెరిగిపోయి నీరు ముందుకు కదలలేని దుస్థితి నెలకొంది. మురుగునీటి వ్యవస్థ కూడా లేకపోవడంతో ఏటా వర్షకాలంలో వంకలకు వరద పోటెత్తడం, ఇల్లు మునగడంపరిపాటిగా మారింది. ఏళ్లుగా ఇదే దుస్థితి. నగరవాసులు సర్వం కోల్పోయి కట్టు బట్టలతో రోడ్డున పడుతున్నారు. వరద సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు చేపట్టిన పాపానపోలేదు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నా..



నడిమివంకలో ఓ వైపు ఆక్రమణలు... మరోవైపు ఏపుగా పెరిగిన ముళ్లకంప చెట్లు

వంకల్లో నీరు వెళ్లేలా కనీస చర్యలు చేపట్టకపోవడం శోచనీయం. దీంతో నగర వాసులను ముంపు భయం వెంటాడుతోంది. నగరంలో ప్రధానమైన నడిమివంక, మరువవంకలపై ఆక్రమణలను తొలగించి, విస్తరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజలు కోరుతున్నారు.

భయం.. భయం..

నడిమి వంక, మరువ వంక, పండమేరు వంకలతో పలు కాలనీలు ముంపు బారిన పడుతున్నాయి. పాతూరు, కమలానగర్, రామ్‌నగర్, వేణుగోపాల్ నగర్, హెచ్చెల్సీ కాలనీ, ఆరో రోడ్డు, ఆజాద్‌నగర్, హౌసింగ్‌బోర్డు, అశోక్‌నగర్, సాయినగర్, సంగమేష్ నగర్, రజకనగర్, గంగానగర్, సోమనాథ్‌నగర్, ఆర్‌కే నగర్, రామచంద్రనగర్ ప్రాంతాల్లో ఇళ్లలోకి పెద్దఎత్తున వరద నీరు చేరుతోంది. ప్రధాన రహదారులు వాగులను తలపిస్తున్నాయి.



గౌరి థియేటర్ సమీపంలో మరువవంకపై ఆక్రమణలు

మురుగు కాలువలు విస్తరించాలి: బాషా, అశోక్‌నగర్



అశోక్‌నగర్‌లో మరువవంక కుంచించుకుపోయింది. మురుగు, వర్షపు నీరు రోడ్డుమీదికి వస్తోంది. వర్షం పడిందో అశోక్‌నగర్ బ్రిడ్జి దగ్గర నుంచి అంబేడ్కర్ భవన్ వరకు మడుగులా మారుతుంది. చాలాసార్లు అధికారులకు కష్టాలు చెప్పాం. ఎవరూ పట్టించుకోవడం లేదు. మరువవంకతోపాటు డ్రైనేజీ కాలువలను విస్తరించాలి. అప్పుడే సమస్య పరిష్కారమవుతుంది.

ఆక్రమణలను ఉపేక్షించేది లేదు



వర్షాకాలంలో వరద ప్రభావాన్ని తగ్గించడంపై దృష్టి సారించాం. నడిమివంక, మరువవంకలో ఆక్రమణలను తొలగించుకోవాలని సూచించాం. నోటీసులు జారీ చేస్తున్నాం. మురుగుకాలవలపై నిర్మించిన కట్టడాలను కూడా గుర్తించి, సంబంధికులకు నోటీసులు ఇస్తున్నాం. వర్షం పడితే నీరంతా మరువవంక, నడిమివంక ద్వారా వెళ్లిపోయేలా చూస్తాం.

\- బాలస్వామి, నగరపాలక సంస్థ కమిషనర్




సూర్యానగర్ బస్టాప్ సమీపంలో మరువవంకలో చెత్తదిబ్బ

చినుకుపడితే సమస్యలు తప్పవు - మాధవి, రజకనగర్



వర్షం పడితే ఇళ్ల నుంచి కాలు బయటకు పెట్టాలంటే భయంగా ఉంటుంది. రజకనగర్ నుంచి నగరంలోకి వెళ్లాలంటే చెరువులను తలపించే రోడ్లపై ప్రయాణం నరకాన్ని తలపిస్తోంది. రెండు, మూడు నెలలపాటు నీటిలోనే ప్రయాణించాల్సి వస్తోంది. నీటి నిల్వ కారణంగా దోమలు వ్యాప్తి చెంది, పందులు సంచరించి రోగాలబారిన పడుతున్నాం. వాన నీరు కాలువల్లో వెళ్లిపోయేలా మురుగు కాలువలు, నడిమివంకను విస్తరించాలి.

అధికారులు కన్నెత్తి చూడరు: గౌస్‌బాషా, సాయినగర్



వర్షపు నీటితో మేం పడుతున్న ఇబ్బందులు ఎవరికి చెప్పుకోవాలో అర్థంకావట్లేదు. వర్షపు నీరు ఇళ్లలోకి వస్తున్నా ఎవరూ పట్టించుకోరు. మరువవంక సమస్య పరిష్కరిస్తే మురుగు, వర్షపు నీరు నిల్వ ఉండకుండా వెళ్లిపోతుంది. ఇప్పటికే పలుమార్లు అధికారులకు తెలియజేసినా ఫలితం లేదు.

ఎస్సీ సంక్షేమం.. అస్తవ్యస్తం..!

- డీడీ సహా కీలక పోస్టులు ఖాళీ
- పర్యవేక్షించే ఏఎస్‌డబ్ల్యుఓలూ కరువే
- సిబ్బంది ఇష్టారాజ్యం

అనంతపురం విద్య, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎస్సీ సంక్షేమ శాఖ అస్తవ్యస్తంగా మారింది. కీలక పోస్టులన్నీ ఖాళీగా ఉన్నాయి. దీంతో పర్యవేక్షణ కొరవడింది.హాస్టళ్లు, కార్యాలయాల్లో సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఆరు నెలలుగా కీలకమైన జిల్లా డిప్యూటీ డైరెక్టర్(డీడీ) పోస్టు ఖాళీగా ఉంది. దీంతో ప్రస్తుతం బీసీ సంక్షేమ శాఖ డీడీ కుష్బూ కొఠారి ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్నారు. ఆమె తన శాఖతోపాటు బీసీ హాస్టళ్ల పర్యవేక్షణకే తలమునకలవుతున్నారు. పాఠశాలలు తెరిచి రెండున్నర నెలలు కావస్తున్నా.. ఆమె తమశాఖ హాస్టళ్లను పర్యవేక్షణ చేయలేదనే ఆరోపవిమర్శలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఎస్సీ సంక్షేమ శాఖను ఆమె తూతూ మంత్రంగా చూస్తున్నారు. దీంతో ఎస్సీ సంక్షేమ శాఖ జిల్లా, డివిజన్ కార్యాలయాలు, హాస్టళ్ల వార్డెన్లు, ఇతర సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహారాలు సాగిస్తున్నారనే ప్రచారం ఉంది. వారు విధులకు కూడా సక్రమంగా వెళ్లడంలేదని, ఒక వేళ వెళ్లినా హాజరు వేసుకొని వెళ్లిపోతున్నారనే విమర్శలు ఉన్నాయి.



పెన్నార్‌భవన్‌లోని ఎస్సీ సంక్షేమశాఖ జిల్లా కార్యాలయం



ఖాళీగా ఉన్న ఎస్సీ సంక్షేమశాఖ డీడీ కుర్చీ


డివిజన్ కార్యాలయాల్లోనూ అంతే..

హాస్టళ్ల పర్యవేక్షణకు డివిజన్ స్థాయిలో ఏఎస్‌డబ్ల్యుఓలు ఉంటారు. జిల్లాలో అనంతపురం, ఉరవకొండ, కళ్యాణదుర్గం, గుత్తి, తాడిపత్రి డివిజన్‌లు ఉన్నాయి. ఇందులో చాలా నెలలుగా ఉరవకొండ, గుత్తి డివిజన్‌లకు రెగ్యులర్ ఏఎస్‌డబ్ల్యుఓలు లేరు. తాజాగా అనంతపురం డివిజన్ ఏఎస్‌డబ్ల్యుఓగా ఉన్న దామోదరరెడ్డి ఉద్యోగోన్నతిపై అన్నమయ్య జిల్లాకు డీడీగా వెళ్లారు. దీంతో ఆ పోస్టు కూడా ఖాళీ పడింది. ప్రస్తుతం ఉన్న ఇద్దరు రెగ్యులర్ ఏఎస్‌డబ్ల్యుఓలలో ఒకరికి ఉరవకొండ, మరొకరికి గుత్తి ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. అనంతపురం డివిజన్ ఇన్‌చార్జ్ బాధ్యతలను బీకేఎస్ హాస్టల్ సీనియర్ వార్డెన్ రామునాయక్‌కు అప్పగించారు. దీన్నిబట్టి డివిజన్‌ల స్థాయిలో కూడా ఎస్సీ సంక్షేమ శాఖ పరిస్థితి ఎలా ఉందో అర్థమవుతోంది. ఇప్పటికైనా పాలకులు, ఉన్నతాధికారులు స్పందించి కీలక పోస్టుల్లో అధికారులను నియమించి గాడి తప్పిన ఆ శాఖను సక్రమమార్గంలో ఉంచాల్సిన అవసరం ఉంది.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

నైపాల్ (జయంతి)




నోబెల్ సాహిత్య పురస్కార గ్రహీత, 'సర్ విద్యాధర్ సూరజ్ ప్రసాద్ నైపాల్ 1932 ఆగస్టు 17న జన్మించారు. గొప్ప నవలా రచయిత. 2001లో 'నోబెల్ ప్రైజ్' అందుకున్నారు. వీఎస్ నైపాల్, విడియా నైపాల్‌గాను పిలుస్తారు. ట్రినిడాడ్ టొబాగో దేశం చాగువానాలో జన్మించిన బ్రిటీష్ రచయిత. 50ఏళ్లలో 30కుపైగా పుస్తకాలు ప్రచురించారు. ఆయన రచనలకు తొలి పాఠకురాలు, ఎడిటరూ, విమర్శకురాలు భార్య ప్యాట్రిసియా అన్నే హెల్. 'ఇన్ ఏ ఫ్రీ స్టేట్' రచనకు 1971లో బుకర్ ప్రైజ్ అందుకున్నారు. 1983, 89లలో జెరూసలెం ప్రైజ్, 1990లో 'నైట్‌హుడ్ ఇన్ బ్రిటన్' తదితర పురస్కారాలు అందుకున్నారు. 2018 ఆగస్టు 11న కన్నుమూశారు.

కొడవటిగంటి (వర్ధంతి)



'కొకు'గా పేరొందిన తెలుగు రచయిత కొడవటిగంటి కుటుంబరావు 1909 అక్టోబరు 28న గుంటూరు జిల్లా తెనాలిలో జన్మించారు. 'చందమామ' మాసపత్రిక అత్యున్నత స్థితికి రావడానికి ఎంతో కృషి చేశారు. హేతువాదిగా ముద్రపడ్డారు. జగత్తులో స్థలము, కాలము అనే రెండు కొలతలే కాకుండా బుద్ధి అనేది కొలతగా పని చేస్తుంది అనే 'బుద్ధికొలత వాదం'ను ప్రతిపాదించారు. తన 50ఏళ్ల రచనా జీవితంలో 10వేల పేజీలకుపైగా రచనలు చేశారు. సమకాలీన మానవ జీవితాన్ని పరామర్శించి, విమర్శించి సుసంపన్నం చేసేదే సరైన సాహిత్యంగా ఆయన భావించారు. 1980 ఆగస్టు 17న కన్నుమూశారు.

భువనచంద్ర (పుట్టినరోజు)



సినీ గేయరచయితగా పేరొందిన భువనచంద్ర 1949 ఆగస్టు 17న కృష్ణా జిల్లాలో నూజివీడు ప్రాంతం గుళ్ళపూడి ప్రాంతంలో జన్మించారు. ఎయిర్‌ఫోర్స్‌లో 18 ఏళ్లపాటు సర్వీసు అందించి వలంటరీ రిటైర్మెంట్ తీసుకుని సాహిత్యంపై మక్కువతో సినీపాటలు రాస్తున్నారు. 1971లో ఇండో-పాకిస్థాన్ యుద్ధంలో పాల్గొని 4 మెడల్స్ అందుకున్నారు. 2వేలకుపైగా పాటలు రాశారు. వందకుపైగా కథలు, నవలలు, మ్యాగజైన్‌లకు రచనలు చేశారు. కొన్ని రియాలిటీ షోలకు న్యాయ నిర్ణేతగా వ్యవహరించారు. 'వెల్‌కమ్ ఒబామా' సినిమాలో నటించారు. కళాసాగర్ అవార్డు, వంశీ అవార్డు, కొవ్వాలి శతజయంతి అవార్డు, సముద్రాల అవార్డు, వేటూరి సాహిత్య పురస్కారం తదితర పురస్కారాలు అందుకున్నారు.

థియర్రీ హెన్రీ (పుట్టినరోజు)



ఫ్రెంచ్ దేశ ఫుట్‌బాల్ క్రీడాకారుడు థియర్రీ డేనియెల్ హెన్రీ 1977 ఆగస్టు 17న జన్మించారు. ఫ్రాన్స్ దేశ చరిత్రలో అంతర్జాతీయ స్థాయిలో ఎక్కువ గోల్స్ సాధించారు. ప్రీమియర్ లీగ్ ఆల్‌టైం గ్రేటెస్ట్ స్ట్రైకర్‌గా పేరొందారు. 2003, 2004లో 'ఫిఫా వరల్డ్ ప్లేయర్ ఆఫ్ ది ఇయర్'లో రన్నరప్‌గా నిలిచారు. 1998 ఫిఫా వరల్డ్ కప్, యూఈఎఫ్ఏ యూరో 2000, 2003 ఫిఫా కన్ఫెడరేషన్స్ కప్ తదితర విజయాలు సాధించారు. 'ఫ్రెంచ్ ప్లేయర్ ఆఫ్ ది ఇయర్'ను ఐదుసార్లు పొందారు. 'ప్రీమియర్ లీగ్ హాల్ ఆఫ్ ఫేం 2021'లో తొలి ఇద్దరు క్రీడాకారులలో ఒకరు.

మంత్రితో మాదిగ నాయకుల భేటీ



మంత్రికి వినతిపత్రం అందజేత

విజయనగర, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ కుల వర్గీకరణలో మాదిగల రిజర్వేషన్ల సమస్యపై శాసన సభలో ప్రస్తావించాలని కోరుతూ మాదిగ నాయకులు మంత్రి జమీర్ అహ్మద్‌ను కోరారు. చామరాజపేట నియోజకవర్గంరాయపుర వార్డులో శనివారం పర్యటన సందర్భంగా మాదిగ నాయకులు మంత్రితో భేటీ అయి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కేఎండీసీ అధ్యక్షుడు టీకే అల్తాఫ్‌ఖాన్, రాయపుర వార్డు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

శనైశ్చరుడికి ప్రత్యేక పూజలు

పావగడ, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): చరిత్ర ప్రసిద్ధిచెందిన పావగడ శీతలాంబ, జేష్టాదేవి సమేత శనైశ్చర స్వామి ఆలయం భక్తులతో పోటెత్తింది. శ్రావణమాసం నాల్గవ శనివారం కావడంతో భక్తులు పెద్దసంఖ్యలో హాజరై తైలాభిషేకం, నవగ్రహపూజ, అమ్మవారికి కుంకుమార్చన చేశారు. దావణగిరి, చిత్రదుర్గం, బళ్లారి, అనంతపురం, కళ్యాణదుర్గం నుంచి భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు దాదాపు 50వేల మందికి పైగా భక్తులు స్వామి వారిని దర్శనం చేసుకున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు అనిల్ కుమార్ తెలిపారు.



ఇస్కాన్‌లో భక్తుల సందడి



బ్యాంకు కాలనీ తనుశ్రీ నివాసంలో



అంజలి కాన్వెంట్‌లో చిన్నికృష్ణులు

మురిసిన మురారి

వాడవాడలా కృష్ణాష్టమి వేడుకలు

బెంగళూరు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణాష్టమి వేడుకలు ప్రతిచోటా సందడిగా సాగాయి. శనివారం పలు విద్యాసంస్థలు, ఆలయాలలో రాధాకృష్ణుల వేషధారణలు సాగాయి. నగరంలో ఇస్కాన్‌కు అనుబంధమైన రాజాజినగర్‌లోని హరేకృష్ణ కొండపై వెలసిన కృష్ణబలరామ ఆలయం, కనకపుర రోడ్డులోని వైకుంఠ కొండలలోని వేంకటేశ్వర ఆలయం, కేటీపీఓ వైట్‌ఫీల్డ్‌లోని శ్రీకృష్ణ మందిరంలో జన్మాష్టమి వేడుకలు జరిగాయి. రెండు రోజుల పాటు మూడు ప్రాంతాలలోనూ శ్రీకృష్ణుడికి అభిషేకాలు, హారతి, చప్పన్ భోగ్, పుష్పాంజలి సేవ, పల్లకీ ఉత్సవ, ఉయ్యాలోత్సవం జరిపారు. 108 రుచులతో చేసిన ప్రసాదాలను నైవేద్యంగా సమర్పించారు. రాజాజినగర్‌లోని ఆలయంలో ఆకర్షణీయం అనిపించేలా పూలు, దీపాలతో అలంకరించారు. ఉదయం 7 గంటలనుంచే భక్తుల రాక ప్రారంభమైంది. 10 గంటలనుంచి క్యూలో వేలాదిమంది వేచి ఉండి దర్శనం చేసుకున్నారు. రాత్రి పొద్దుపోయేదాకా హారతి, అభిషేకాలు కొనసాగాయి. పౌర, ఆహార సరఫరాలశాఖ మంత్రి కేహెచ్ మునియప్ప, ఎంపీ జగ్గేశ్, ఎమ్మెల్యే మునిరాజ్, నటి శృతి, ధ్రువసర్జా తదితరులు పాల్గొన్నారు. కేటీపీఓలో ఆనంద మహోత్సవాన్ని నిర్వహించారు. చిన్నారుల నృత్యాలు సంగీతం, శ్లోకాల పఠనం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఇస్కాన్ బెంగళూరు అధ్యక్షులు మధుపండితదాస మాట్లాడుతూ జన్మాష్టమి వేడుకలలో లక్షలాదిమంది భక్తులు రావడం సంతోషంగా ఉందన్నారు. ప్రపంచవ్యాప్తంగా డిజిటల్ రూపంలో ఇక్కడి వేడుకలను వీక్షిస్తున్నారన్నారు. భక్తులకు సేవలు అందించేందుకు పోలీసులతోపాటు వలంటీర్లు నిరంతరంగా పనిచేశారన్నారు. కాగా బెట్టనపాళ్యలో శ్రీకృష్ణ హళ్ళికార మహాసంస్థాన ట్రస్టు ఆధ్వర్యంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా సాగాయి. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

అంజలి కాన్వెంట్‌లో..

సుంకదకట్టె శ్రీనివాసనగర్‌లోని అంజలి కాన్వెంట్, నైటింగేల్ హైస్కూల్‌లో కృష్ణాష్టమి వేడుకలు జరిగాయి. చిన్నారులు రాధాకృష్ణ వేషధారణతో పాల్గొని నృత్యాలు చేశారు. సంస్థ కార్యదర్శి ఎంఎన్ సరళ, ప్రిన్సిపాల్ కృష్ణగౌడతోపాటు షీబా, లక్ష్మి, ప్రభావతి, సంస్థ అధ్యక్షులు ఎన్‌జీ గౌడ తదితరులు పాల్గొన్నారు.

అగరలో..

బొమ్మనహళ్ళి: కృష్ణాష్టమిని పురస్కరించుకుని నియోజకవర్గ వ్యాప్తంగా పలు ఆలయాలలో వేడుకలు సాగాయి. అగర, హెచ్ఎస్ఆర్ లే అవుట్ తదితర ప్రాంతాలలో సందడి నెలకొంది. అగరలోని ఆలయంలో రుక్మిణీ సమేత రాధాకృష్ణులు కొలువై ఉంటారు. శనివారం ఉదయం పంచామృతాభిషేకం, విశేషపూజలు జరిగాయి. చుట్టుపక్కల ప్రాంతాల భక్తులు పెద్దసంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు. తీర్థ ప్రసాదాల అనంతరం అన్నదానం నిర్వహించారు. సాయంత్రం భక్తి సంగీత విభావరి జరి గింది. సాయంత్రం పుర వీధులలో ఊరేగింపు నిర్వహించారు. యాదవ సంఘం సభ్యుడు కృష్ణ మాట్లాడుతూ దశాబ్దాలుగా ఇక్కడ కృష్ణాష్టమి వేడుకలు కొనసాగుతున్నాయన్నారు. మాజీ కార్పొరేటర్ లతా నరసింహమూర్తి, యాదవసంఘం నాయకుడు రంగనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న చిన్నికృష్ణుల పోటీలు

బాగేపల్లి: కృష్ణాష్టమిని పురస్కరించుకుని శనివారం పట్టణంలోని పాఠశాలల్లో చిన్నికృష్ణుల వేషధారణతో పోటీలు ఆకట్టుకున్నాయి. హలో కిడ్స్ పాఠశాల సంస్థాపకులు, పాఠశాల పాలకమండలి ముఖ్యులు అశోక్ ఆధ్వర్యంలో రాధాకృష్ణులకు పూజలు చేశారు. శ్రీకృష్ణుడి తత్వాలు ఆదర్శనీయమని ఉపాధ్యాయురాలు నూర్‌భాను అభిప్రాయపడ్డారు. మన భారతీయ సంస్కృతిలో పండుగలు, పర్వదినాలకు ఎంతో విశిష్టత ఉందన్నారు. సత్యం, న్యాయం, నీతి ధర్మాలకు రక్షకులుగా శ్రీకృష్ణుడి ఆచరించి చూపారన్నారు. ఉపాధ్యాయులు భాగ్యలక్ష్మి, కావ్య తదితరులు పాల్గొన్నారు.



నిర్మాత డీకే దేవేంద్ర నివాసంలో కృష్ణాష్టమి వేడుకలు



ఓ చిన్నారి ఇలా..



విజయపురలో..



బెట్టనపాళ్యలో శ్రీకృష్ణుడికి అలంకరణ



భక్తులకు ప్రసాదం పంపిణీ



రాధాకృష్ణులు, రుక్మిణీ



ఇస్కాన్‌లో అలంకరణ



కవ్వం చిలుకుతున్న భక్తులు

ఘనంగా శ్రావణ శనివార పూజలు



శిడ్లఘట్టలో వేంకటేశ్వరస్వామికి అలంకరణ



విద్యాశంకరకు విశేష అలంకరణ



శనైశ్వర ఆలయంలో అలంకరణ

బెంగళూరు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): శ్రావణ శనివారం పురస్కరించుకుని నగర వ్యాప్తంగా వేంకటేశ్వర ఆలయాలలో విశేషపూజలు కొన సాగాయి. ఇందులో భాగంగా జయనగర్ ఒకటోబ్లాక్ లాల్‌బాగ్ సిద్ధాపురలోని లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో గణపతి పూజ, పుణ్యాహ, వాస్తు హోమం, సుదర్శన హోమం, మహావిష్ణు హోమం నిర్వహించారు. స్వామివారికి మహామంగళారతి అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. అన్నసంతర్పణ నిర్వహించారు. సాయంత్రం పురవీధులలో స్వామివారిని ఊరేగించారు. వరసిద్ధి వినాయక గెళెయర బళగ, కుమారరామ సేవా ట్రస్టు, ఆర్యవైశ్యమండలి, భువనేశ్వరి సార్వజనిక సేవా సమితి సభ్యులు పర్యవేక్షించారు. గుట్టెపాళ్య, కేఎం కాలనీ, రాఘవేంద్ర కాలనీ చుట్టుపక్కల ప్రాంతాల భక్తులు పాల్గొన్నారు.

శిడ్లఘట్టలో..

శిడ్లఘట్ట: తాలూకాలోని బెళ్ళూటి గేట్ సమీపానగల భూనీళా పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి దేవాలయంలో శ్రావణమాసం నాల్గో శనివారం, రెండో వార్షికోత్సవం పురస్కరించుకుని విశేషపూజలు నిర్వహించారు. వార్షికోత్సవంలో భాగంగా మూడురోజులపాటు కార్యక్రమాలు సాగాయి. గురువారం మహా సుదర్శన హోమం, శుక్రవారం లక్ష్మీనారాయణ హృదయ హోమం, శ్రీనివాస కల్యాణోత్సవం, శనివారం చక్రస్నానం తదితర పూజా కైంకర్యాలు కొనసాగాయి. విశేషపూజలు, ధూపదీప నైవేద్యాల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ నిర్వహించారు.



గుట్టెపాళ్యలో విశేషహోమం



శ్రీవారికి తోమాల అలంకరణ

సైనికుల సేవలు చిరస్మరణీయం

బీజేపీ నేత బీఎల్ సంతోష్



మాజీ సైనికులతో బీఎల్ సంతోష్ తదితరులు

దొమ్మసంద్ర, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): కార్గిల్ నుంచి ఆపరేషన్ సిందూర్ దాకా మన సైనికులు ఎంతోమంది సాధనలతోనే ప్రత్యర్థులకు గుణపాఠం చెప్పడంతో శాంతిభద్రతలలో వారి సేవలు చిరస్మరణీయమని బీజేపీ జాతీయ సంఘటనా ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్ అభిప్రాయపడ్డారు. సర్జాపురలో అఖిల కర్ణాటక మాజీ సైనికుల సంఘం ఆధ్వర్యంలో శనివారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. 26వ కార్గిల్, ఆపరేషన్‌సిందూర్ విజయోత్సవం నిర్వహించి మృతుల సైనికులకు శ్రద్ధాంజలి ఘటించారు. పాకిస్థాన్ కవ్వింపు చర్యలకు మన సైనికులు ధీటుగా బదులిచ్చారన్నారు. బిపిన్ రావత్ వంటి అధికారుల ధైర్య సాహసాలతో మన సైనికులు సరైన జవాబు ఇచ్చారన్నారు. అఖిల కర్ణాటక మాజీ సైనికుల సంఘం బెంగళూరు అధ్యక్షుడు వేణు మాట్లాడుతూ మాజీ సైనికులు, ప్రజలు 1500మంది పాల్గొని దేశభక్తి పెంపొందించేలా జాగృతి కల్పిస్తున్నట్టు తెలిపారు. ఐదు కిలోమీటర్ల ర్యాలీ చేశామన్నారు. కార్యక్రమంలో కేప్టెన్ ప్రాంజల్ తండ్రి వెంకటేశ్, ఎమ్మెల్సీ గోపినాథ్, సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శివణ్ణ, గౌరవాధ్యక్షుడు జయణ్ణ, 1962, 1963, 1971లలో కార్గిల్ యుద్ధంలో పాల్గొన్న సైనికులు, అధికారులు స్థానిక ప్రముఖులు భాగస్వామ్యులయ్యారు.

వైభవంగా గ్రామదేవత పల్లకీ మహోత్సవం



పురవీధులలో రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

బొమ్మనహళ్ళి, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): శ్రావణ శనివారం పురస్కరించుకుని నియోజకవర్గంలోని సోమసుందరపాళ్యలో గ్రామదేవత గురుమూర్తి స్వామి ఉత్సవం నిర్వహించారు. స్వామిని వేంకటేశ్వరస్వామిగా భావించి గోవింద నామస్మరణ చేస్తూ పురవీధులలో ఊరేగించారు. గురుమూర్తి స్వామి చుట్టుపక్కల ప్రాంతాల వారికి కులదేవతగా ఉన్నారు. ఆలయానికి సుమారు 500 ఏళ్ల చరిత్ర ఉంది. ఉత్సవంలో గ్రామస్తులంతా భాగస్వామ్యులవుతారు. భక్తులు ఉపవాసం ఉండి పల్లకీ ఉత్సవంలో పాల్గొంటారు. ఆలయంలో ప్రాకారోత్సవం అనంతరం స్వామివారిని పురవీధులలో ఊరేగిస్తారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ, అన్నదానం నిర్వహించారు. శ్రావణమాసం చివరి శనివారం కావడంతో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఎమ్మెల్యే సతీశ్‌రెడ్డి, స్థానిక ప్రముఖులు కే వాసుదేవరెడ్డి, శ్రీనివాసరెడ్డి, మురళీధరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాటకాల ద్వారా చైతన్యం



నాటకంలో ఓ సన్నివేశం

బెంగళూరు, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): ప్రజలలో చైతన్యం కల్పించేలా జైన్ గ్రూప్ సహకారంతో ఐబీవరల్డ్ స్కూల్ నాలెడ్జ్ ఎం అకాడమీ ఆధ్వర్యంలో ప్రత్యేక నాటకాలను ప్రదర్శించారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మార్పు దిశగా భారత్ అనే నినాదంతో ప్రత్యేక జాగృతి శిబిరాలు నిర్వహించింది. జేఎస్ఎస్ సర్కిల్, జయనగర్ పోలీస్‌స్టేషన్ సర్కిల్‌లలో నాటకాలను ప్రదర్శించారు. హాస్యం, శాంతితోపాటు అవగాహన కల్పించేలా ప్రదర్శనలు నిర్వహించినట్టు శనివారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1626.06	1,623.79
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	28,721	33,419
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	28,567	86,310
నీటి నిల్వ (టీఎంసీలు)	80.00	72.61

బాలుడిని బలిగొన్న థిన్నర్

బెంగళూరు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): రంగుల పనుల్లో వాడే థిన్నర్ పేలి మంటలు చెలరేగడంతో బాలుడు బలయ్యాడు. ధారవాడ నగరం సంతోష్‌నగర్‌లో థిన్నర్ వల్ల కలిగిన ప్రమాదంతో బాలుడు అగస్త్య మశ్యాల్(4) దుర్మరణం చెందాడు. శుక్రవారం ఉదయం ప్రమాదం జరిగింది. అగస్త్య తల్లికి రెండో కాన్పుగా ఇటీవల కొడుకు పుట్టాడు. బాలింతకు వేడి ధూపం వేసేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. వారం రోజులుగా ఎడతెరిపిలేకుండా వర్షాలు కురుస్తుండడంతో ధూపం వేసేందుకు తెచ్చిన బొగ్గులు తడిసిపోయాయి. దీంతో బాలుడి తండ్రి చంద్రకాంత్ ఇంట్లో పెయింటింగ్‌కు ఉపయోగించే థిన్నర్ ఉంటే వేయాలని సూచించారు. అందుకు తగ్గట్టుగానే కొంచెం థిన్నర్ వేశారు. అది ఒక్కసారిగా మంట చెలరేగింది. థిన్నర్ బాటిల్‌కు మంటలు వ్యాపించాయి. అగస్త్య అవ్వ ఆ బాటిల్‌ను గదినుంచి బయటకు విసిరేందుకు ప్రయత్నించారు. పొరపాటున అగస్త్యతోపాటు తండ్రి చంద్రకాంత్ ఉన్న గదిలోకి బాటిల్ పడింది. అక్కడ మంటలు చెలరేగాయి. గదిలో ఉన్న చంద్రకాంత్, అగస్త్యలను రక్షించి బయటకు తీసుకొచ్చేలోగా ఇద్దరికీ కాలిన గాయాలయ్యాయి. వెంటనే కిమ్స్ మెడికల్ కళాశాల ఆసుపత్రికి తరలించారు. అగస్త్య చికిత్స ఫలించక మృతి చెందాడు. తండ్రి చంద్రకాంత్ కాలిన గాయాలతో ఆసుపత్రి చికిత్స పొందుతున్నారు. అదే ఇంట్లో ఉన్న చంద్రకాంత్ భార్య, మరో కుమారుడు, అత్త ప్రమాదం నుంచి బయటపడ్డారు. బాలుడి మృతితో కుటుంబంలో విషాదం నెలకొంది.

మైనింగ్ మానవాభివృద్ధికి దోహదపడాలి

● సమాజ పరివర్తన సంఘం సభ్యులు హిరేమఠ్



మాట్లాడుతున్న పరివర్తన సభ్యులు హిరేమఠ్

బళ్లారి సిటీ, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): మైనింగ్ మానవాభివృద్ధికి దోహదపడాలి కానీ, శాపం కారాదని సమాజ పరివర్తన సంఘం సభ్యులు హిరేమఠ్ అన్నారు. గనుల ప్రభావిత పర్యావరణం ప్రజల జీవనోపాధి పునరుద్ధరణ పోరాట కమిటీ రాష్ట్రస్థాయి సమావేశం శనివారం నగరంలోని గాంధీ భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లామాట్లాడారు. రెడ్డి మూఠా ఆంధ్ర, కర్ణాటక సరిహద్దుల్లోని మైనింగ్ సంపదను రెండు రాష్ట్రాలను పాలించే ప్రభుత్వాల మద్దతుతో దోచుకుందన్నారు. దీనిపై ఫిర్యాదు దాఖలైన తర్వాత ఖనిజాన్ని దోచుకుంటున్న రెడ్డి మూఠా జైలుకు వెళ్లిందన్నారు. తరువాత గనుల ప్రభావిత ప్రాంతాల అభివృద్ధి కోసం ఒక ఎస్‌పీవీని ఏర్పాటు చేసి రూ.36,000 కోట్ల నిధిని ఏర్పాటు చేశారన్నారు. అక్రమ మైనింగ్ ద్వారా ప్రభావితమైన ప్రజల అభివృద్ధి కోసం సుప్రీంకోర్టు కేఎంఈఆర్‌సీ నిధిని ఏర్పాటు చేసినా, దాని అమలు సరిగా జరగడంలేదన్నారు. నేటికీ సుప్రీంకోర్టు ఉల్లంఘన జరగడం బాధాకరమన్నారు. బళ్లారిలోని మైనింగ్ ప్రభావిత ప్రాంతం మరోసారి గ్రీన్ జోన్‌గా మారాలని అల్లమ ప్రభు పెట్టదూర్ అన్నారు. సండూర్ ప్రాంతంలోని రక్షిత అడవిలో మైనింగ్ నిర్వహించకూడదన్నారు. పర్యావరణానికి హాని కలిగించ కుండా ఆధునిక పద్ధతిలో పరిశ్రమలను ఏర్పాటు చేయాలన్నారు. గినగేరా సమీపంలో పరిశ్రమల స్థాపనకు ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. కల్యాణ్ కర్ణాటకాలో ప్రభుత్వం అణు విద్యుత్ ప్రాజెక్టును అమలు చేయడానికి ప్రయత్నిస్తోందని, ఇది పర్యావరణానికి కూడా హాని కలిగిస్తుందన్నారు. నగేంద్ర, చాగనూర్ మల్లికార్జున, చామరస మాలిపాటిల్ , రవికృష్ణా రెడ్డి,విఠల్, నాగలక్ష్మి, మాధవరెడ్డి, సోమశేఖర్‌గౌడ, శివకుమార్ పాల్గొన్నారు.

భత్రి ఈరన్న ఉత్సవాలకు సర్వం సిద్ధం



ఉత్సవమూర్తికి పూజలు చేస్తున్న మాజీ మేయర్ రాజేశ్వరి సుబ్బరాయుడు తదితరులు

బళ్లారి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): బళ్లారిలోని భత్రి లో వెలసిన అత్యంత మహిమ కలిగిన పురాతన మైన భత్రి ఈరన్న స్వామి దేవాలయ ఉత్సవాలకు సర్వం సిద్ధం అయ్యింది. మాజీ మేయర్ రాజేశ్వరి సుబ్బరాయుడు, 34వ వార్డు లో ఉండే భక్తులతో పాటు అనేక మంది ఉత్సవాల ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. 1947 లో శాతవాహనులు స్థాపించిన ఈ దేవాలయం అత్యంత ప్రసిద్ధి చెందింది. మహిమాన్వితుడైన భత్రి ఈరన్నను దర్శించుకునేందుకు సుదూర దూరాల నుంచి భక్తులు తరలివస్తుంటారు. శ్రావణమాసంలో ప్రత్యేక పూజలు, రథోత్సవం నిర్వహించడం ఆనవాయితీ. సోమవారం ఉదయం 3 గంటలకు గంగ పూజ, వీరభద్ర పూజ, లక్ష్మినరసింహ పూజలు నిర్వహిస్తారు.

గణేశ్ ఉత్సవాలు శాంతియుతంగా జరుపుకోవాలి

● శాంతి సమావేశంలో జిల్లా అధికారి నితీశ్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నితీశ్

రాయచూరు, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): ఈ నెల 27దవ తేదీ నుంచి ప్రారంభమైయ్యే గౌరి గణేశ్ ఉత్సవాలు జిల్లాలో ప్రశాంతంగా సంబరంగా జరుపుకునేందుకు ప్రతియొక్కరు తగిన ఏర్పాట్లు చేసుకోవాలని జిల్లాధికారి కే నితీశ్ సూచించారు. గణేశ్ ఉత్సవాల నేపథ్యంలో శనివారం నూతన జిల్లాధికారి కార్యాలయంలో శాంతి సమావేశం నిర్వహించారు. సభకు అధ్యక్షత వహించిన జిల్లాధికారి వాతావరణ కాలుష్యానికి గురి కాకుండా మట్టితో చేసిన గణపతులను ప్రతిష్టించుకోవాలని ఉత్సహ కమిటీ ప్రతినిధులకు సూచించారు. దీంతో పాటు ప్రభుత్వం సూచించిన నిబంధనలు ప్రతియొక్కరు పాటించాలని కోరారు. ఎలాంటి భావోద్వేగాలు, ఘర్షణలకు ఆస్కారం లేకుండా ఉత్సవాలను శాంతియువ వాతావరణంలో జరుపుకోవాలన్నారు.



జలమయమైన కాలేజీరోడ్డులో ఇబ్బంది పడుతున్న వాహనదారులు

భారీ వర్షానికి రహదారులు జలమయం

బళ్లారి సిటీ, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): విజయనగరం, ధార్వాడ జిల్లాల్లో శుక్రవారం సాయంత్రం వివిధ ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. సాయంత్రం హొసపేట నగరంలో రహదారులు భారీ వర్షంతో జలమయమయ్యాయి. చాలా చోట్ల ద్విచక్ర వాహనాలు చెడిపాయాయి. రైడర్లు తమ వాహనాలను తోసుకుంటూ వెళ్లాల్సి వచ్చింది. హొసపేట తాలూకాలోని కమ్మపుర, హంపి, మరియమ్మనహళ్ళి ప్రాంతాల్లో వర్షం కురవడంతో రైతుల పనులకు ఇబ్బంది కలిగింది. పంటపొలాలు నీట మునిగాయి.

కల్యాణస్వామి భవన్ ప్రారంభించిన ఎంపీ



కల్యాణ భవన్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ తుకారం, ఎమ్మెల్యే అన్నపూర్ణ

బళ్లారి సిటీ, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): నగరంలో నిర్మించిన కల్యాణ స్వామి భవన్‌ను ఎంపీ ఇ.తుకారం ,ఎమ్మెల్యే అన్నపూర్ణ తుకారం శనివారం ప్రారంభించారు. ఈసందర్భంగా కొట్టూరు సంస్థాన మఠం బసవలింగ మహాస్వామి, మైసూర్ జిల్లా దావణగెరె గురులింగజంగమ దేవర మఠం నటరాజ మహాస్వాములు, సవదత్తి ఉగరగోళ మఠద మహాంత స్వామి, విజయపుర జిల్లా తాళికోటె గుండకనాళ మఠం గురులింగ శివాచార్యులు, జానుకుంటె మఠం సిద్దులిగ శివాచార్య, నందిపుర మహేశ్వర స్వామి, దారవాడ నరేంద్ర మఠం సంగమేశ స్వామీజీ, జంగమర హొసళ్ళి మఠం అజాత శంభులింగ స్వామీజీ, సవితానందస్వామి, హరగినడోణి అభినవ సిద్దులింగ శివచార్యులు, ప్రారంభోత్సవ కార్యక్రమలో పాల్గొన్నారు. నగరంలోని పంపాపతి శాస్త్రి ఈశ్వరయ్య, 'బుడా' అధ్యక్షుడు ఆంజనేయులు, గుత్తిగనూరు విరూపాక్షగౌడ, ఆసుండి నాగరాజు, అల్లం ప్రశాంత్, ఇబ్రాహీం, కేఎస్ఎల్ స్వామి, నిష్టిరుద్రప్ప, రవిశంకర గురూజీ తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు భగవద్గీతపై అవగాహన కల్పించాలి

● కృష్ణాష్టమి వేడుకల్లో ఎమ్మెల్యే నారా భరత్ రెడ్డి సూచన



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి



నగరంలో ఊరేగింపు

బళ్లారి సిటీ, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): నేటి పిల్లలకు ఖాళీ సమయంలో భగవద్గీతలోని శ్రీకృష్ణుని బోధనలను వినిపించాలని నగర ఎమ్మెల్యే నారాభరత్ రెడ్డి అన్నారు. జిల్లా యంత్రాంగం, జిల్లాపంచాయతీ, కన్నడ సాంస్కృతిక శాఖ, మున్సిపల్ కార్పోరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నగరంలోని రాజ్‌కుమార్ రోడ్డులోఒని బీడీఏఏ ఫుట్‌బాల్ గ్రౌండ్ హాల్లో శనివారం నిర్వహించిన కృష్ణాష్టమి వేడుకలను ఆయన ప్రారంభించి మాట్లాడారు.శ్రీకృష్ణుడు ఒక గొప్ప వ్యక్తి అని, ప్రపంచ సంక్షేమం కోసం మానవ మత మనుగడ కోసం అనేక సందేశాలను బోధించిన మహనీయుడు అన్నారు. పిల్లలకు భగవద్గీత ప్రాముఖ్యత బోధించాలన్సిన బాధ్యత తల్లిదండ్రులదేనన్నారు. లెదర్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ ఛైర్మన్ ముండరగి నాగరాజు మాట్లాడుతూ శ్రీ కృష్ణుడు పునర్జన్మ పొందుతాడనే సందేశం భగవద్గీతలో ఉందని, ఆయన ఆదర్శపురుషుడిగా విశ్వఖ్యాతి పొందారన్నారు. మేయర్ ముల్లంగి నందీశ్ మాట్లాడుతూ కలమతాలకు అతీతంగా దేశవ్యాప్తంగా శ్రీ కృష్ణుని జయంతిని జరుపుకుంటారన్నారు. ఈ రోజున పిల్లలు కృష్ణుడు, రాధ వేషదారణలో ఉండటం అద్భుతంగా ఉందన్నారు. శ్రీ కృష్ణ జయంతి వేడుకలను పురస్కరించుకుని నగరంలో భారీ ఊరేగింపు జరిగింది. డోలు వాద్యం, తాషే వంటి వివిధ సాంస్కృతిక బృందాలు పాల్గొని ఊరేగింపుకు ఉత్సాహాన్నిచ్చాయి. నగరంలోని కనకదుర్గమ్మ ఆలయ ప్రాంగణం నుంచి ప్రారంభమైన ఊరేగింపు చన్నప్ప సర్కిల్ మీదుగా బీడీఏఏ ఫుట్‌బాల్ గ్రౌండ్ వేదిక వరకు సాగింది. ఈసందర్భంగా జిల్లా హామీ పథకాల ఇన్‌చార్జ్ చిదానందప్ప, సిద్దరామకల్మట, గొల్లరసంఘం అధ్యక్షుడు గాదెప్ప, కన్నడ సాంస్కృతికశాఖ నాగరాజు, కార్పోరేషన్ సభ్యులు హొన్నూరప్ప, జబ్బార్, సామాజిక నాయకులు,ప్రజలు ఇతరులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో జోరుగా సంబరాలు

బళ్లారిరూరల్ (ఆంధ్రజ్యోతి): కృష్ణాష్టమి సందర్భంగా నగరంతోపాటు వివిధ గ్రామాల్లో శ్రీకృష్ణాష్టమి సందర్భంగా చిన్నారులను వివిధ రకాల అలంకరణలతో ముస్తాబు చేశారు. చిన్నారులను శ్రీకృష్ణుడు వేషధారణలో ప్రత్యేకంగా అలంకరణ నిర్వహించి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

గొల్ల సంఘం కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ. 25 లక్షలు: ఎమ్మెల్యే

బళ్లారిరూరల్ (ఆంధ్రజ్యోతి) : నగరంలో బీడీఏఏ గ్రౌండ్ సభ ప్రాంగణంలో కన్నడ మరియు సంస్కృతి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రీకృష్ణ జయంతి కార్యక్రమాన్ని ఎమ్మెల్యే భరత్ రెడ్డి ప్రారంభించారు. కృష్ణ జయంతి సందర్భంగా ఎమ్మెల్యే భరత్ రెడ్డి మాట్లాడుతూ గొల్ల యాదవ సంఘం నాకు మద్దతు ఇచ్చి నన్ను ఆదరించిందని నాకు సహకరించిన సంఘానికి కమ్యూనిటీ ఆలయ నిర్మాణానికి యాదవ సంఘానికి ఆలయ నిర్మాణానికి అన్ని విధాలా సహకరిస్తామని ఎమ్మెల్యే తెలిపారు.



గోపికలు, శ్రీకృష్ణుడి వేషధారణలో చిన్నారులు

కంప్లి(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో శనివారం శ్రీ కృష్ణ జన్మాష్టమిలో భాగంగా తాలుకా పరిపాలన, గొల్లర సంఘం సహకారంతో ప్రత్యేక పూజలు నిర్వహించి చిత్ర పటానికి పూలమాలలు వేసి వార్షికోత్సవాన్ని జరుపుకున్నారు. శ్రీకృష్ణుడి ఆదర్శాలను అనుసరించడం ద్వారా మెరుగైన జీవితాన్ని నిర్మించడంలో ప్రతి ఒక్కరు ముందుండాలని తహసీల్దార్ జుగల్ మంజునాథ అన్నారు. కృష్ణాష్టమి సందర్భంగా చిన్నారుల వేషధారణలు ఆకట్టుకున్నాయి

విజయనగర ఫర్టిలైజర్స్‌లో..

బళ్లారి సిటీ (ఆంధ్రజ్యోతి): శ్రీ కృష్ణజన్మాష్టమిని శనివారం నగరంలోని విజయనగర ఫర్టిలైజర్స్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా యజమాని గణపాల్ ఐనాథ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మాదిరిగా ఈ సంవత్సరం కూడా వేడుకలు నిర్వహించామన్నారు. ఈసందర్భంగా గణపాల్ గిరి గోవిందరెడ్డి, కుటుంబ వర్గం, ఫర్టిలైజర్‌లో పనిచేసే కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



పూజల్లో పాల్గొన్న గుణపాల్ ఐనాథ్ రెడ్డి

ధర్మస్థాపనకే శ్రీకృష్ణుడి జననం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సిద్ధలింగేష్ రంగన్నవర్

హొస్పేట(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణుడు అధర్మాన్ని నాశనం చేసి, భూమిపై మతాన్ని స్థాపించడడానికి జన్మించాడని కన్నడ, సంస్కృతి శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సిద్ధలింగేష్ రంగన్నవర్ అన్నారు. కలెక్టర్ కార్యాలయ ఆడిటోరియంలో నిర్వహించిన కృష్ణాష్టమి వేడుకల్లో ఆయన మాట్లాడారు.



శ్రీకృష్ణ,రాధ వేషధారణలో విద్యార్థిని, విద్యార్థులు

గంగావతి రూరల్, (ఆంధ్రజ్యోతి): గంగావతి నగరంలోని ప్రతిష్టాత్మక పాఠశాల అయిన కిడ్స్ స్కూల్లో కృష్ణాష్టమిని ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సవితా నేత్రరాజ్ గురు మఠం మాట్లాడుతూ విష్ణువు పది అవతారాలలో ఒకటైన శ్రీ కృష్ణుడు సత్యం, మతం.న్యాయం యొక్క సందేశానికి ప్రతీక అని అన్నారు. ఈసందర్భంగా పాఠశాల అధినేత నేత్రరాజ్, పాఠశాల సిబ్బంది పూర్ణిమ, కుముదిని, లత్రశ్రీ,రేష్మా,శిల్పా, వైష్ణవి,సుమ,జ్యోతి,మంజునాత్ తదితరులు పాల్గొన్నారు.

హోసూరు జోన్

శ్రీవారి ఆలయంలో శ్రావణ శనివార పూజలు



అలంకరణలో శ్రీవారు

హోసూరు, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): శ్రావణ శనివారం పురస్కరించుకుని స్థానిక వేంకటేశ్వర స్వామి ఆలయాలలో విశేషపూజలు జరిగాయి. గోపసంద్ర ప్రాంతంలో వందల సంవత్సరాల పురాతనమైన వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. స్థానికంగా తెలుగు, కన్నడ మాట్లాడేవారు శ్రావణ మాసం విధానాలను పాటిస్తారు. వేంకటేశ్వర స్వామి వేలాదిమంది భక్తులకు ఇంటిదేవుడిగా ఉన్నారు. స్వామివారికి నిర్వహించిన పూజల్లో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. అన్నదానం నిర్వహించారు.

కృష్ణాష్టమి వేడుకలు

హోసూరు గోకుల్‌నగర్‌లోని రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో కృష్ణాష్టమి వేడుకలు శనివారం వైభవంగా జరిగాయి. స్వామివార్లకు వెన్న అలంకరణ నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. కాగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు విశ్వహిందూపరిషత్, బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణుడి విగ్రహాన్ని కొలువుదీర్చి పూజలు చేశారు. రాధాకృష్ణుల వేషధారణలో పిల్లల ఊరేగింపు ఆకట్టుకుంది. బాగలూరు రోడ్డులోని శ్రీకృష్ణ ఆలయం నుంచి ఎంజీ రోడ్డు, నేతాజీ రోడ్డు మీదుగా ఆలయానికి చేరింది. వీహెచ్‌పీ నాయకులు, బీజేపీ నాయకులు, చిన్నారులతోపాటు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



శ్రీకృష్ణుడికి వెన్న అలంకారం

మురుగన్ ఆలయాల్లో..



ఆడివెళ్లి, ఆడిపూరం, ఆడి అమావాసై, ఆడి కృత్తిగై వంటి పర్వదినాలలో సుబ్రమణ్యస్వామి ఆలయాలలో ప్రత్యేక పూజలు జరిగాయి. పెరియార్‌నగర్ మురుగన్ ఆలయంలో స్వామివారికి విశేషపూజల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. శనివారం ఉదయం నుంచి సాయంత్రం దాకా భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

అలంకరణలో మురుగన్

పైసలున్నా పరిశుభ్రత సున్న..!

● కంచే చేను మేసిన చందాన బళ్లారి ఏపీఎంసీ ● నిద్రావస్థలో పాలక మండలి అధికారులు
● వర్షం వచ్చిందంటే కాలుతీసి కాలువేయలేని దుస్థితి ● జిల్లా అధికారిని ఆశ్రయించిన ట్రేడర్లు



మార్కెట్‌లో బురదమయమైన రహదారులు

బళ్లారి గాంధీనగర్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): బళ్లారి ఏపీఎంసి మార్కెట్‌లో నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. ఎక్కడ చూసినా అపరిశుభ్రత తాండవిస్తోంది. ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా మార్కెట్ పరిసరాలు అధ్వానంగా తయారయ్యాయి. ఎక్కడ చూసినా కుళ్ళిన కూరగాయలు, బురదమయమైన రోడ్లతో పరిసరాలు అపరిశుభ్రంగా తయారయ్యాయి. తాజా కూరగాయాలు కొనేందుకు మార్కెట్‌కు వెళ్తే రోగాలు తెచ్చుకోవాల్సిందేనని వినియోగదారులు వాపోతున్నారు. మార్కెట్ నిర్వహణలో భాగంగా నెలనెల మార్కెట్ శుభ్రత, సెక్యూరిటీ పేరిట లక్షలాది రూపాయలు బిల్లులు డ్రా చేస్తున్నారే కానీ పరిశుభ్రతా చర్యలు శూన్యమని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్ శుభ్రత పనులు చేపట్టిన సరిగా చేపట్టక పోవడంతో మార్కెట్ వ్యాపారస్తులు, ట్రేడర్స్ ఏపీఎంసీ అధికారులు, పాలక వర్గంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో వాణిజ్య ఉత్పత్తులతో పాటు హోల్ సేల్ కూరగాయల మార్కెట్ కూడా ఇదే ప్రాంగణంలో ఉండడంతో రోజూ టన్నుల కొద్ది వర్థాలు తయారవుతున్నాయి. వీటిన్నిటిని ట్రాక్టర్ల సహాయంతో మార్కెట్‌కు నుండి 5 కిలోమీటర్ల దూరంలో వేయాలనే నిబంధనలు ఉన్నా... తొలగించిన వ్యర్థ పదార్థాలు మార్కెట్ ప్రాంగణంలో ఒక మూలన వేయడంతో మార్కెట్ మరింత అపరిశుభ్రంగా తయారవుతోంది. విషయం ఏపీఎంసీ అధికారులకు, పాలక మండలికి తెలిసినా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వడ్డించే వాడు మనవాడైతే ఎంత తింటే ఏముందిలే అన్న చందానా... మార్కెట్‌లో క్లీనింగ్ పనులు చేసినా... చేయక పోయినా... బిల్లులు మాత్రం కాంట్రాక్టరుకు చెల్లిస్తున్నట్లు మార్కెట్‌లో వ్యాపారులు ఆరోపిస్తున్నారు. మార్కెట్‌లో నెలకొన్నసమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్ళినా... తరచూ మార్కెట్‌ను సందర్శిస్తున్న అధికారులు కేవలం బుక్కుల్లో ఉన్న అంకెల పరిశీలనకే పరిమితం అవుతున్నారే మినహా... మార్కెట్ ప్రాంగణంలో వాస్తవ స్థితిని గమనించడం లేదని మార్కెట్‌లో వ్యాపారస్తులు ఆవేధన వ్యక్తం చేస్తున్నారు. సమస్యలపై నోరెత్తితే రాజకీయ ఒత్తిళ్ళు తీసుకొచ్చి నోరుమూయించే ప్రయత్నం చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏది ఏమైనా... ప్రజా ప్రయోజనాలు, ప్రజా ఆరోగ్యం దృష్ట్యా ఏపీఎంసి మార్కెట్‌లో నెలకొన్న సమస్యపై జిల్లా యంత్రాంగం జోక్యం చేసుకుని అవసరమైన చర్యలు చేపట్టడంతో పాటు అధికారులకు మార్కెట్ నిర్వహణపై గట్టి ఆదేశాలు ఇవ్వాల్సిన అవసరం ఉంది. ఇదే విషయంపై శనివారం ఏపీఎంసీ ట్రేడర్స్ అసోసియేషన్ జిల్లాధికారి కార్యాలయం చేరుకుని వినతిపత్రం అందజేశారు.



కుళ్లిపోయిన కూరగాయల మూటలు



భూమిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే బీఎం నాగరాజు

మరుగుదొడ్ల నిర్మాణానికి భూమిపూజ

సిరుగుప్ప, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలో రూ. 37 లక్షల వ్యయంతో మరుగుదొడ్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే బీఎం నాగరాజ శనివారం భూమిపూజ చేశారు. సిరుగుప్ప పట్టణం బాలికల హైస్కూలులో మరుగుదొడ్లు నిర్మించనున్నారు. పనులు నాణ్యతగా చేపట్టాలని కాంట్రాక్టర్లకు సూచించారు. ఈ సందర్భంగా పంచాయతీరాజ్ శాఖ ఏఈఈ తిప్పేస్వామి, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాలో నిర్లక్ష్యం తగదు

● జడ్పీ సీఈఓ నోంగ్‌జోయ్ మహ్మద్ అలీ అక్రమ్ షా



మాట్లాడుతున్న సీఈఓ నోంగ్‌జోయ్ మహ్మద్ అలీ అక్రమ్ షా

హొస్పేట, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): నీరు చాలా విలువైనది, ప్రతి ఒక్కరూ దాని విలువను తెలుసుకోవాలి, జేజేఎం పథకం కింద 24గంటల నిరంతర నీటి సరఫరా స్థిరమైన నిర్వహణ కోసం గ్రామ పంచాయతీలు, ప్రజలుఆ శాఖతో చేతులు కలపాలని జడ్పీ సీఈఓ నోంగ్‌జోయ్ మహ్మద్ అలీ అక్రమ్ షా అన్నారు. శనివారంఆయన గ్రామీణ స్థిరమైన తాగునీటి సరఫరా ప్రాజెక్టులో భాగంగా కొత్తూరు తాలూకాలోని కందగల్లు, హగరిబొమ్మనహళ్లి తాలూకాలలోని కలహళ్లి 24ఇంటూ7 నీటి సరఫరా గ్రామాలనుప్రారంభించారు. జిల్లాపంచాయతీ, గ్రామపంచాయతీ కార్యాలయం కందగల్లు, హనాసి, గ్రామీణ తాగునీరు, పారిశుద్ధ విభాగం ద్వారా జల్‌జీవన్ మిషన్ పథకం కింద ఆపరేషన్ నిర్వహణ సంస్థాగతీకరణను బలోపేతం చేస్తూ మాట్లాడారు. గ్రామాలను ప్రకటించే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతి రోజు నీటిని శుద్ధిచేసి సరఫరా చేస్తామని, ప్రతి పైపులో నీటి లీకేజీని నివారించడానికి చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు.